ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శనివారం 24 ఆగస్టు 2024 | 5



సర్‌ప్రైజ్ విజిట్లు చేస్తా : సీఎం చంద్రబాబు

కొత్తపేట, ఆగస్టు 23: రాష్ట్రంలో ఎక్కడ అవినీతి జరిగినా తనకు సమాచారం వస్తుందని, ఆ ప్రాంతాల్లో సర్‌ప్రైజ్ విజిట్లు చేస్తానని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అధికారులు అందరూ నిబద్ధతతో పనిచేయాలి. నేను ఏ ప్రభుత్వ కార్యాలయానికి వస్తానో ముందుగా ఎవ్వరికీ తెలియనివ్వను. ప్రజలతో మమేకమై ప్రజాప్రతినిధులు, అధికారులు పనిచేయాలని ఆయన సూచించారు.





ప్రజల సమస్యలు వింటున్న సీఎం చంద్రబాబు



పల్లెలను అభివృద్ధి చేస్తా : వానపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న చంద్రబాబు



జై చంద్రబాబు : చంద్రబాబుకు ప్లకార్డులతో మహిళల స్వాగతం



మీకు నేనున్నా : గ్రామస్తులకు అభయమిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు



వానపల్లి గ్రామస్తులకు చంద్రబాబు అభివాదం

పల్లెకొచ్చిన.. చంద్రుడు

వానపల్లిలో చంద్రబాబు వరాల జల్లు

సర్పంచ్ అడిగారని.. వానపల్లికి రూ.10 కోట్లు

కొత్తపేట, ఆగస్టు 23 : సీఎం చంద్రబాబునాయుడు వానపల్లిలో జరిగిన గ్రామసభలో సర్పంచ్ పల్లి భీమారావును మెచ్చుకున్నారు. మూడుసార్లు సర్పంచ్‌గా పనిచేస్తున్నాడంటే అతని అవినీతిరహితమైన పరిపాలనను ప్రజలు గుర్తించారన్నారు. అలాగే వానపల్లి అభివృద్ధికి 16 విభాగాల పనులకు సంబంధించి సుమారు రూ.10 కోట్లు అవుతాయని తనకు నివేదిక ఇచ్చారని, వాటన్నింటినీ మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలతో మమేకమై పనిచేస్తేనే ప్రజలే పట్టంగడతారని అన్నారు.

అమలాపురం/కొత్తపేట,ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పల్లెకు చంద్రుడొచ్చాడు..వెలుగులు తెచ్చాడు.. మీ సమస్యలన్నీ పరిష్కరిస్తానని వానపల్లిలో వరాలజల్లు కురిపించాడు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలంలోని వానపల్లిలో శుక్రవారం జరిగిన గ్రామసభలో సీఎం చంద్ర బాబు పాల్గొని మాట్లాడారు. పెట్టుబడి తగ్గించి ఆదాయం పెరిగేలా రైతులు వినూత్న ఆలోచనలతో ముందుకు వెళ్లాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా పెట్టుబడిని తగ్గించే ప్రకృతి సేద్యం చేసేలా ప్రోత్సహిస్తాం. రాష్ట్రంలో వర్షాలు పడడం శుభసూచకం. రాబోయే రోజుల్లో కరువు అనేది రాదు. ఇక్కడే పోలవరం ప్రాజెక్టు ఉంది. వీలైనంత త్వరలో దాని పూర్తిచేసి గోదావరి జిల్లాల ప్రజలకు మూడు పంటలకు నీళ్లిస్తామని స్పష్టంచేశారు. రైతులకు అన్ని విధాలా అండగా ఉంటామని చెప్పారు. ఇటీవల రూ.1,670 కోట్ల ధాన్యం బకాయిలను రైతులకు చెల్లించాం. 48 గంటల్లోనే ధాన్యం బకాయిలు చెల్లించే విధానాలతో ప్రభుత్వం ముందుకు వస్తోందని తెలిపారు. డ్వాక్రా సంఘాలకు రూపకల్పనచేసిన తానే.. ఆయా సంఘాల్లో ఉన్న మహిళల అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తానని చెప్పారు. గ్రామాల్లోని మహిళల ఉపాధి అవకాశాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉపాధి పొందుతూ ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తులు కింది స్థానంలో ఉన్న వారిని దత్తత తీసుకుని వారి ఆదాయం పెంచే విధంగా సహకరించాలని సూచించారు. జన్మభూమి స్ఫూర్తితో ఈ తరహా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. సభలో చంద్రబాబు ఎవరి పేర్లను ప్రస్తావించకుండానే ప్రసంగాన్ని ముగించేశారు. గ్రామసీమల అభివృద్ధికి తమ ప్రభుత్వం ఇస్తున్న అధిక ప్రాధాన్యతలను మాత్రం సభలో పదేపదే ప్రస్తావించడం ద్వారా ప్రజలను ఆకట్టుకోగలిగారు.

రెండున్నర గంటలపాటు గ్రామసభ

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాకతో సభా ప్రాంగణం కిక్కిరిసింది. రెండున్న గంటలపాటు సభ జరగ్గా గంటా 20 నిమిషాలపాటు చంద్రబాబు ప్రసంగం కొనసాగింది. మధ్యాహ్నం 2.20 గంటలకు అయినవిల్లిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్న కాన్వాయ్‌లో వానపల్లికి మధ్యాహ్నం 2.50 గంటలకు వానపల్లి చేరుకున్నారు. అక్కడ నాయకులు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. వానపల్లి పళ్లాలమ్మవారి ఆలయంలోకి వెళ్లిన చంద్రబాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం నేరుగా సర్పంచ్ పల్లి భీమారావు అధ్యక్షతన గ్రామసభ జరిగే వేదిక వద్దకు చేరుకున్నారు. సర్పంచ్, ఏపీడీల ప్రసంగం తరువాత నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు గంటా 20 నిమిషాల పాటు అనర్గళంగా ప్రసంగించడంతో ఎమ్మెల్యే బండారు, ఎంపీ హరీష్‌మాధుర్‌లకు మాట్లాడే అవకాశం రాలేదు. చంద్రబాబు ప్రసంగం తరువాత గ్రామస్తుల్లో కొందరికి అవకాశం కల్పించారు. చంద్రబాబు సభావేదికపైకి రాకముందు మాలమహానాడుకు చెందిన కొందరు కార్యకర్తలు సభలోకి ప్రవేశించడంతో వారిని గుర్తించిన పోలీసులు తక్షణమే సభాప్రాంగణం నుంచి బయటకు తీసుకెళ్లారు. వేదికపై కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తదితరులు ఉన్నారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిశాంతికి వేదికపై సీటు లేకపోవడంతో మీటింగ్ జరుగుతున్నంతసేపు నిలబడే ఉన్నారు. సభా వేదిక పక్కనే ఎమ్మెల్యేలు దాట్ల సుబ్బరాజు, గిడ్డి సత్యనారాయణ, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, కోనసీమ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, ఆకుల రామకృష్ణతో సహా అనేకమంది కీలక నాయకులంతా సభావేదిక పక్కనే కుర్చీల్లో ఆశీనులు కావడం కనిపించింది.

- గ్రామాల రూపురేఖలు మారుస్తా
- డ్వాక్రా మహిళల అభివృద్ధికి కృషి
- రైతులకు అండగా ఉంటా
- మూడు పంటలకు నీళ్లిస్తా
- పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తా
- తోటివారిని దత్తత తీసుకోండి
- ఉమ్మడి జిల్లాలో సీఎంగా తొలిసభ సక్సెస్



సీఎంతో రేజీనాయుడు

మా గ్రామంలో ఫ్యాక్టరీ పెట్టించండి సార్..

ఒక యువకుడి కోరిక.. కలెక్టర్‌కు సీఎం ఆదేశాలు

అమలాపురం/కొత్తపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గ్రామసభలో సీఎం చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలో ఓ యువకుడు తాను మాట్లాడతానని పెద్దగా అరిచాడు.. ఇది గమనించిన సీఎం అతడిని వేదికపైకి పిలిచి మైకు ఇచ్చారు. అతను ఏఐ వస్తుంది కదా సార్ ఏం చేస్తారని ప్రశ్నించాడు. ఇంతలో మరో యువకుడు మాట్లాడేందుకు వేదిక దగ్గరికి వచ్చాడు. ఇటు రావయ్యా అంటూ అతడిని పిలిచి బాబు మైకు అందించారు. వేదికపై పాల్గొన్న అందరి పేర్లు సంబోధిస్తూ ఏలూరి శ్రీనివాసధనరాజు (రేజీనాయుడు) ప్రసంగాన్ని ప్రారంభించాడు. అక్కడే ఉన్న మహిళలను చూపించి వీరంతా ఈ ఊరి నుంచి సుమారు 40 కిలోమీటర్లు వెళ్లి రవళి స్పిన్నింగ్ మిల్‌లో షిఫ్టుల వారీగా పనులు చేస్తున్నారు. ఊపిరితిత్తుల సమస్యలు వస్తున్నాయి. ఇక్కడే ఏదైనా మహిళలకు ఉపాధి కలిగే ఫ్యాక్టరీని ఏర్పాటు చేయండని అభ్యర్థించాడు. దానిపై చంద్రబాబు స్పందించి ఇక్కడ మహిళలకు ఉపాధి కలిగేలా ఫ్యాక్టరీ ఏదైనా నెలకొల్పేందుకు చర్యలు తీసుకోండని కలెక్టర్‌కు సూచించారు. ఎంతో మహిమగల అమ్మవారు పళ్లాలమ్మ తల్లి. ఆమె చుట్టూ ప్రకృతివనం ఒకటి ఏర్పాటు చేయండని అభ్యర్థించాడు. వెంటనే స్పందించిన చంద్రబాబు పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. నువ్వు ఏం చేస్తావని అతడిని అడిగినప్పుడు నేను ఆటో నడుపుతాను అని బదులిచ్చాడు. అయితే నీకు ఎలక్ట్రికల్ ఆటో తీసి ఇస్తా నడుపుకుంటావా అని చంద్రబాబు అనగా అందుకు ఆ యువకుడు ఈ రోడ్లలో ఎలక్ట్రికల్ ఆటో పనికిరాదు సార్ అంటూ సున్నితంగా తిరస్కరించాడు. సామాజిక స్పృహ ఉన్న ఇటువంటి యువకుడు సమాజానికి అవసరమంటూ చంద్రబాబు అభినందించారు. ఇక్కడ పరిశ్రమ ఏర్పాటుకు అవకాశాలను గుర్తించి బండారు సత్యానందరావు ద్వారా తనకు నివేదిక పంపాలని, వాటిని మంజూరు చేస్తామని చెప్పారు. గంధ్రోతు సతీష్ అనే యువకుడు మాట్లాడుతూ గౌతమీ గోదావరి నది మధ్యలో కృష్ణ జింకల సంరక్షణకు చర్యలు తీసుకోవడంతోపాటు టీడీపీని నమ్ముకుని ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న ఆకుల రామకృష్ణకు పార్టీ నామినేటెడ్ పదవి ఇవ్వాలని చంద్రబాబును అభ్యర్థించారు. వానపల్లి గ్రామానికి చెందిన కంచుస్తంభం లక్ష్మణరావు మాట్లాడుతూ మీతోనే రాష్ట్ర భవిష్యత్ అంటూ చెప్పడంతో సీఎం చంద్రబాబు అతడిని భుజం తట్టారు. అనంతరం చింతపల్లి కిరణ్, ఇళ్ళ సత్తిబాబులకు ఎలక్ట్రికల్ బైక్‌లు, చల్లపల్లికి చెందిన పోలిశెట్టి వీరవెంకట సత్యనారాయణకు ఒక ఇల్లు, రూ.లక్ష ఆర్థిక సాయం చేయమని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌ను ఆదేశించారు.



బాబుతో పోలవరం ప్రాజెక్టు అధికారి



బాబుకు యువకుడి జ్ఞాపిక



మీ వెంటే బాబు : గ్రామసభకు హాజరైన జనం



సీఎంకు సమస్య విన్నవిస్తున్న వృద్ధ దంపతులు



లక్ష్మణరావుకు అభినందన



దివ్యాంగుడి సమస్య వింటున్న చంద్రబాబు



చంద్రబాబుకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఎయిర్‌పోర్టులో చంద్రబాబుకు వీడ్కోలు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 23: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పర్యటనకు సీఎం హోదాలో తొలిసారిగా వచ్చిన చంద్రబాబుకు నాయకులు, అధికారులు ఘన వీడ్కోలు పలికారు. ఆయన కొత్తపేట మండలం వానపల్లిలో శుక్రవారం మధ్యాహ్నం సభ ముగించుకుని మధురపూడి ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. సీఎం చంద్రబాబుకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ డి.నరసింహకిశోర్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణుడు, టీడీపీ నాయకుడు బొడ్డు వెంకటరమణచౌదరి వీడ్కోలు పలికారు. చంద్రబాబును కలిసేందుకు ప్రజలు పెద్దఎత్తున ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు.

తండ్రి కళ్లెదుటే.. కొడుకు మృతి

రాజమహేంద్రవరం,ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తండ్రి కళ్లెదుటే కుమారుడు మృతిచెందిన విషాద ఘటన ఇది. మోరంపూడిలో ఉన్న అన్నపూర్ణ టైల్స్ గొడౌన్‌కు గుజరాత్ నుంచి శుక్రవారం టైల్స్ లోడును తీసుకొచ్చారు. వర్షం వస్తుండడంతో టైల్స్ దిగుమతి ఆగింది. బరకం కడతామని లారీ ఎక్కిన క్లీనర్ రాథోడ్ వీరేశ్(34) కరెంటు తీగలు తగిలి విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డాడు.అది చూసి తండ్రి(డ్రైవర్) జయోశ్ బోరున విలపించాడు. అనంతరం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

డ్రైనేజీల్లేవ్.. రోడ్లూ లేవు!

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

స్వర్ణ గ్రామ పంచాయతీల పేరిట తెలుగుదేశం కూటమి ప్రభుత్వం శుక్రవారం జిల్లాలో నిర్వహించిన గ్రామ సభలకు సమస్యలు పోటెత్తాయి. జనం తండోపతండాలుగా తరలివచ్చి సమస్యలు మొరపెట్టుకున్నారు. జిల్లాలో 299 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ప్రతి పంచాయతీలో డ్రైనేజీలు, రోడ్లు, పైపులైన్ లీకేజీలు, పారిశుధ్య, తాగునీరు, ఇళ్ల స్థలాలు తదితర సమస్యలు వెలుగులోకి వచ్చాయి. గత ప్రభుత్వంలో సమస్య చెప్పడానికి వెనుకడుగు వేసే పరిస్థితి ఉండేది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ సభలకు మాత్రం ప్రజలు స్వేచ్ఛగా వచ్చి తమ ఊరి సమస్యలను ఏకరవు పెట్టారు. గ్రామాల్లో రాజకీయ పార్టీనేతలు, స్థానిక ప్రజాప్రతినిధులే కాకుండా ప్రజలు సమస్యలను లేవనెత్తారు. సభా ముగింపులో ప్రజలు ఇచ్చిన విజ్ఞప్తులపై తీర్మానాలు చేశారు. వేలాది పనులపై తీర్మానాలు జరిగాయి. అన్ని అంశాలు కలుపుకుంటే సుమారు రూ.1000కోట్లకు పైగా వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లావ్యాప్తందా అన్ని గ్రామాల్లోనూ డ్రైనేజీ సమస్య ఉంది. సీసీ రోడ్ల సమస్య ఉంది. పైపులైన్ల సమస్య ఉంది. ఒక్కో పంచాయతీలో సుమారు 4 కిలోమీటర్ల నుంచి 5 కిలోమీటర్ల వరకూ డ్రైనేజీ సమస్యలు ఉన్నాయి.. కిలోమీటర్ల కొలదీ సీసీ రోడ్లు నిర్మించాల్సి ఉన్నట్టు తేలిసింది. డ్రైనేజీల నిర్మాణానికే సుమారు రూ.500 కోట్ల వరకూ అవసరం ఉంటుందని భావిస్తున్నారు. సీసీ రోడ్లకు నిధులు అవసరం. వీటన్నింటినీ ఉపాధిహామీ పథకం ద్వారా నిర్మించనున్నారు. వేగంగా నిధులు విడుదల చేసి అన్నీ ప్రాధాన్యతా క్రమంగా పనులు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. సీతానగరం మండలం ముగ్గళ్లలో 75 వర్కులకు తీర్మానం చేశారు. ధవళేశ్వరం సుమారు రూ.50 కోట్ల విలువైన వర్కులకు తీర్మానాలు చేసినట్టు సమాచారం. ఇలా ప్రతి గ్రామంలోనూ ప్రజలు చెప్పిన అంశాలను తీర్మానాలు చేశారు. కొన్ని చోట్ల ప్రజలు గతంలో పనులు చేయకపోవడాన్ని నిలదీశారు. దేవరపల్లి జగనన్న కాలనీల్లో ఇళ్ల మంజూరులో అన్యాయం జరిగిందని పలువురు వాపోయారు. అయితే ఆ పంచాయతీ వైసీపీ వార్డు సభ్యుడు పార్టీలకతీతంగా అర్హులకు ఇచ్చామని అనడంతో ఇళ్లు మంజూరుకానివారు తిరగబడ్డారు. గౌరీపట్నంలో భూహక్కు రీసర్వేలో అవకతవకలు జరిగాయని రైతులు ఫిర్యాదు చేశారు. ధవళేశ్వరంలో ఎన్నిసార్లు చెప్పి, మా డ్రైన్ల పట్టించుకోరేంటని కొందరు ప్రశ్నించారు. ఇలా జిల్లాలో రికార్డు స్థాయిలో గ్రామ సభలు జరిగాయి. ప్రారంభంలో మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాటకూటేశ్వరంలో మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ పి. ప్రశాంతి,ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి,నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వేంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకట్రాజు నియోజకవర్గాల గ్రామ సభల్లో పాల్గొన్నారు.

- ప్రజల చెంతకు చేరిన పాలన
- 299 పంచాయతీల్లో గ్రామసభలు
- ప్రజల నుంచి భారీ స్పందన
- ఎక్కడికక్కడ సమస్యలతో క్యూ
- సాయంత్రానికి తీర్మానాలు
- అంచనాలతో నివేదికలు

పల్లె సమస్యలన్నీ పరిష్కరిస్తాం

మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, ఆగస్టు 23 : రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో ఉన్న సమస్యలను సత్వరం పరిష్కరించే దిశగా గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దురేష్ అన్నారు. నిడదవోలు మండలం కాటకూటేశ్వరం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక సమస్యలు ప్రజల నుంచే తెలుసుకునేందుకు సభలు ఎంతో దోహద పడతాయన్నారు. గ్రామ సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించడంజరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ గ్రామ ప్రజల హక్కులు బాధ్యతలు తెలుసుకునేందుకు వేదిక గ్రామ సభలన్నారు. ఈ కార్య క్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, సర్పంచ్ కొయ్యల వెంకటేశ్వరరావు,వైస్ సర్పంచ్ కొప్పిశెట్టి మంగరాజు,ఎంపీడీవో పి.శామ్యూల్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలపై నిలదీత..

నిడదవోలు మండలం డి.ముప్పవరం గ్రామ సభ రసాబాసగా మారింది.గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకలపై గ్రామస్తులు అధికారులను నిలదీశారు. ఉపాధి హామీ పనుల నిమిత్తం విడుదలైన నిధుల గురించి కల్పించిన పనిదినాల గురించి ప్రజలకు వివరణ ఇవ్వడంలో అధికారులు విఫలమయ్యారు.దీంతో గ్రామస్తులకు అధికారులకు మధ్య కొంత సేపు వాగ్వాదం జరిగింది.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్ చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు

ఏపీలో బీఆర్ అంబేడ్కర్ యూనివర్శిటీ
మనుగడ ప్రశ్నార్థకం

- విభజనం చట్టం ప్రకారం ముగిసిన గడువు
- 2024-25 ఫస్టియర్ అడ్మిషన్లు నిలిపివేత

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 23: సమైక్యాంధ్రలో 1982లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయ సెంటర్లను ఏర్పాటు చేశారు. నందమూరి తారక రామారావు టీడీపీని స్థాపించి తొలిసారిగా ప్రభుత్వం ఏర్పాటు చేశాక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో యూనివర్శిటీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి కొన్ని లక్షల మంది విద్యార్థులు డిగ్రీ, పీజీలు పూర్తి చేసుకుని ఉన్నస్థాయిలో స్థిరపడ్డారు. అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత 10వ షెడ్యూల్ ప్రకారం పదేళ్లపాటు ఉమ్మడి కార్యాచరణలో ఇరు రాష్ట్రాల్లోను అంబేడ్కర్ యూనివర్శిటీ కేంద్రాలు నడిచాయి. ఏడాదికి ఆంధ్రప్రదేశ్‌లో 76 కేంద్రాల్లో డిగ్రీ, పీజీ కోర్సులను లక్షలాది మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు.2023-24 విద్యాసంవత్సరంతో రాష్ట్ర విభజన జరిగి పదేళ్ల గడువు ముగియడంతో విభజిత ఆంధ్రప్రదేశ్ అంబేడ్కర్ యూనివర్శిటీ కేంద్రాల్లో 2024-25 విద్యాసంవత్సరం అడ్మిషన్లు నిలిచిపోయాయి. ఇప్పటి వరకు సెకండ్, థర్డ్ ఇయర్ చదువుతున్న వారు, పీజీ కోర్సులు చదువుతున్న వారు కొనసాగుతుండగా ఫస్టియర్‌కు అడ్మిషన్లు బంద్ చేశారు. దీంతో యూనివర్శిటీకి సంబంధించి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. కొత్త రాష్ట్రంలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీకి రాజమహేంద్రవరం, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు తదితర నగరాలతో పాటు ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్‌లో సెంటర్లు ఉన్నాయి. వాటిలో అడ్మిషన్లు నిలిచిపోవడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా యూనివర్శిటీకి సంబంధించిన కార్యకలాపాలను ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సి ఉంది. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని సెంటర్‌లో ప్రతి ఏడాది సుమారు 2 వేల మంది అడ్మిషన్లు తీసుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఫస్టియర్‌కు అడ్మిషన్లు నిలుపుదల చేశారు. అయితే ఈ ఏడాది జూలై చివరిలో తెలంగాణలో ఫస్టియర్ అడ్మిషన్లు ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇంకా అడ్మిషన్లు ప్రారంభం కాకపోవడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. దీంతో విద్యార్థులు ఉద్యమానికి సన్నద్ధమవుతున్నారు.





కోనసీమలో సీఎంకు
ఘన స్వాగతం

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం పర్యటించారు. కొత్తపేట మండలం వానపల్లిలో నిర్వహించిన స్వర్ణ గ్రామ సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయన్ను అయినవిల్లిలో ఏర్పాటుచేసిన హెలిపాడ్ వద్ద కలిశారు. సీఎంకు అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు.






సత్యనారాయణ స్వామి వ్రతమాచరిస్తున్న నవ దంపతులు

నూతన దంపతులతో సందడిగా
సత్యదేవుని సన్నిధి

అన్నవరం, ఆగస్టు 23: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధి శుక్రవారం నూతన దంపతులతో కిక్కిరిసింది. గురువారం రాత్రి రత్నగిరిపై ఒక్కటైన జంటలతో పాటు వివిధ ప్రాంతాల్లో వివాహం చేసుకున్న నూతన దంపతులు సత్యదేవుని వ్రతమాచరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నూతన దంపతులను అంతరాలయంలో స్వామివారి దర్శనానికి ఉచితంగా అనుమతించారు. శుక్రవారం 3వేల వ్రతాలు జరగ్గా సుమారు 500 కొత్త జంటలు వ్రతమాచరించాయి. వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.30లక్షల ఆదాయం వచ్చింది.


గంజాయితో దొరికన బిహార్‌వాసులను చూపిస్తున్న పోలీసులు

కిలో గంజాయి పొట్లాలతో
ఇద్దరు బిహారీల అరెస్టు

కాకినాడ క్రైం, ఆగస్టు 23: కాకినాడ పోర్టు పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీచ్ రోడ్డులో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు పోర్టు సీఐ పి.సునీల్‌కుమార్ తెలిపారు. బిహార్ రాష్ట్రానికి చెందిన రవీందర్ యాదవ్, రాజేష్ ఠాగూర్ శుక్రవారం మధ్యాహ్నం సమయంలో బీచ్ రోడ్డులోని సాత్విక్ గొడౌన్స్ ఎదురుగా గంజాయిని చిన్న పొట్లాలుగా కట్టి అధిక డబ్బుల కోసం గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న సుమారు కిలో గంజాయి పొట్లాలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

భారీగా గంజాయి పట్టివేత?

గోకవరం, ఆగస్టు 23: రంపచోడవరం నుంచి గోకవరం వైపు బొలెరో వాహనంలో తరలిస్తున్న గంజాయిని గోకవరం మండల పరిధిలోని రామన్నపాలెం సమీపంలో పోలీసులు పట్టుకున్నట్టు తెలియవచ్చింది. భారీ స్థాయిలోనే గంజాయి దొరికిందని, తరలిస్తున్న వ్యక్తులు పరారైనట్టు విశ్వసనీయ సమాచారం. గంజాయితో పట్టుబడిన వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లినట్టు స్థానికులు చెప్తున్నారు.



గంజాయి తరలిస్తున్న వాహనం, గంజాయి సంచులు →

ఆ యువతి ఏమైందో!

యానాం, ఆగస్టు 23: యానాం ఫెర్రీ రోడ్డులోని జీసస్ విగ్రహం సమీపంలోని రాజీవ్ బీచ్ వద్ద గుర్తు తెలియని యువతి శుక్రవారం గౌతమి గోదావరిలోకి నడుచుకుంటూ వెళ్లిపోయింది. ఆ సమయంలో అక్కడే ఉన్న వ్యక్తి ఆమెను కాపాడేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. గోదావరిలో గల్లంతైంది. ఆమె కుడి కాలు చెప్పు మాత్రమే లభ్యమైంది. 18-20ఏళ్ల మధ్య వయసున్న ఆమె తెల్ల రంగు చున్నీ ధరించినట్టు స్థానికులు తెలిపారు. పోలీసులు అక్కడకు చేరుకుని వివరాలు సేకరించి గాలింపు చర్యలు చేపట్టారు.


బీచ్ సమీపంలో దొరికిన యువతి కుడి కాలి చెప్పు



సతీష్‌ను గుర్తు చేసుకుని విలపిస్తున్న కుటుంబ సభ్యులు, మృతుని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెక్కు అందిస్తున్న పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

తల్లడిల్లిన హృదయం

చేతికందివచ్చిన కొడుకు మృతితో కన్నీరుమున్నీరైన సతీష్ మాతృమూర్తి

మామిడికుదురు, ఆగస్టు 23: చేతికి అందివచ్చిన కొడుకు ఆసరాగా నిలుస్తానుకున్న ఆ తల్లి ఆశ అడియాస అయ్యింది. అచుత్యాపురంలోని ఫార్మా సెజ్‌లోని ఎసెన్షియా పరిశ్రమంలో జరిగిన విస్ఫోటనంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పాశర్లపూడిలంకకు చెందిన మారిశెట్టి సతీష్ (33) మరణించిన సంగతి తెలిసిందే. అతడి మృతదేహం శుక్రవారం తెల్లవారుజామున స్వగ్రామానికి చేరుకుంది. మృతదేహాన్ని చూసి సతీష్ తల్లి పద్మావతి, భార్య వెంకట నాగమణి విలపించిన తీరు చూపరులను కలచివేసింది. సతీష్ తండ్రి కొబ్బరి బొదినీలు తయారు చేసి విక్రయిస్తుంటాడు. తల్లి గృహిణి కాగా సోదరుడు రమేష్ తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమారుడైన సతీష్ ఉద్యోగంలో స్థిరపడి కుటుంబాన్ని ఆదుకుంటాడనుకున్న సమయంలో మృత్యువు కాటేసిందంటూ ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. 25 రోజుల క్రితం ఇంటికి వచ్చిన సతీష్ ఇలా విగతజీవిగా రావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సతీష్ అంత్యక్రియలను శుక్రవారం తెల్లవారుజామున గ్రామంలో నిర్వహించారు. కాగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా రూ.కోటి చెక్కును సతీష్ కుటుంబానికి పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అందజేశారు. ఆయన వెంట సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, జనసేన నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, బొరుసు సత్తిబాబు వున్నారు.


మారిశెట్టి సతీష్ (పాత చిత్రం)

మృతుల కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా అందజేత


గణేష్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, ఆగస్టు 23: అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కొప్పర్తి గణేష్‌కుమార్ మృతదేహాన్ని శుక్రవారం తెల్లవారుజామున 2.30 గంటలకు తీసుకువచ్చారు. విషయం తెలిసిన వెంటనే అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గణేష్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా రూ.కోటి చెక్కు అందించి అన్ని విధాలా ఆదుకుంటుంటామని భరోసా ఇచ్చారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటరామారెడ్డి, నేతలు పాలచర్ల శివ ప్రసాద్‌చౌదరి, సింగారపు రామారావు, వెంకటేష్, మధు, ఆర్డీవో కె.శివజ్యోతి, తహసీల్దారు డబ్బ్యు లక్ష్మీరమణి తదితరులు పాల్గొన్నారు.


నాగబాబు కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న తహసీల్దారు చంద్రశేఖరరెడ్డి

సామర్లకోట, ఆగస్టు 23: అచ్యుతాపురం ఫార్మా సెజ్ విస్ఫోటనంలో మృతి చెందిన అసిస్టెంట్ మేనేజరు నాగబాబు కుటుంబాన్ని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పరామర్శించారు. నాగబాబును తీసుకురావడం ఎవరితరం కాదని, అతడి కుటుంబానికి భరోసా ఇస్తామని చెప్పి ఓదార్చారు. కాగా ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా రూ.కోటిని చెక్కు రూపంలో సామర్లకోట తహసీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి నాగబాబు కుటుంబీకులకు టీడీపీ, జనసేన నాయకుల సమక్షంలో అందజేశారు.


హారిక తల్లి అన్నపూర్ణకు చెక్కు అందజేస్తున్న తహసీల్దారు జితేంద్ర

సర్పవరం జంక్షన్, ఆగస్టు 23: అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలుడు దుర్ఘటనలో మృతి చెందిన ట్రైనీ ఇంజనీరు చల్లపల్లి హారిక తల్లి అన్నపూర్ణకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెక్కును అర్బన్ తహసీల్దారు జితేంద్ర అందజేశారు. ఆ సమయంలో అన్నపూర్ణ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఒక్కగానొక్క కుమార్తె జీవించి లేనప్పుడు తాను ఎవరి కోసం బతకాలని, ఈ డబ్బులు ఏం చేసుకోవాలని బోరున విలపించింది. దీంతో ఆమెను అధికారులు సముదాయించారు.




రెండో రోజు అంతర్జాతీయ సెమినార్‌లో మాట్లాడుతున్న రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు, 60 పరిశోధనా రచనలు చేసిన డాక్టర్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న ప్రముఖులు

సైన్స్‌తోనే మానవాళి మనుగడ

విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలి

అంతర్జాతీయ సెమినార్ ముగింపు సభలో వక్తలు

మండపేట, ఆగస్టు 23: సైన్స్‌తోనే మానవ జీవితం ముడిపడి ఉందని దక్షిణ కొరియా శాస్త్రవేత్త కె.నవీన్‌కుమార్ పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే సైన్స్‌పట్ల అవగాహన పెంచుకుని నూతన పరిశోధనలు చేయాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులు జరిగిన అంతర్జాతీయ సెమినార్ ముగింపు సభ శుక్రవారం జరిగింది. నవీన్‌కుమార్ తో పాటు మరో శాస్త్రవేత్త ఎ.భార్గవ్ తాము చేసిన ఫ్లోరోసిక్ పౌడర్, ఎల్ఈడీలు అనే పరిశోధనలపై ప్రసంగించారు. ఆర్ఎంటీ యూనివర్సిటీ (నాగపూర్) ప్రొఫెసర్ సంజీవ్‌జోగేల్ నానో మెటీరియల్స్, నానో ఇంజన్ల గురించి విద్యార్థులకు వివరించారు. మారుతున్న అవసరాలకు అనుగుణంగా మాన వాళికి అవసరమైన టెక్నాలజీతో పాటు అనేక పరిశోధనలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వక్తలు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ సెమినార్‌ను విజయవంతం చేసిన ఘనత అధ్యాపకుడు కె.శ్రీనివాస్‌కు దక్కుతుందన్నారు. సదస్సు నిర్వహణకు సహకరించిన దాతలకు ప్రిన్సిపాల్ కేటీటీవీ శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ కె.శ్రీనివాస్ పరిశోధించిన 60 రిపోర్టులను పుస్తకంగా తయారు చేసి ఆవిష్కరించారు. నేటి యువతకు, విద్యార్థులకు ఆయన రాసిన పరిశోధనా వ్యాసాలు ఎంతగానో దోహదపడతాయని పలువురు వక్తలు అన్నారు. నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర, సాంకేతికతలను అలవాటు చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సెమినార్ విజయవంతం అయ్యేందుకు కృషి చేసిన శ్రీనివాస్, కిరణ్‌కుమార్, ఇతర అధ్యాపకులు, సిబ్బందిని అభినందించారు. సెమినార్‌ను విజయవంతంగా నిర్వహించిన కె.శ్రీనివాస్‌ను ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సత్కరించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు, నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మితో పాటు విదేశాలు, పలు రాష్ట్రాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలను సత్కరించి మెమెంటోలు అందజేశారు.


2.800 గ్రాముల బరువుతో చిన్నారి

నాడు బక్కగా... నేడు బొద్దుగా

చింతూరు సీహెచ్‌సీలో శిశువుకు అరుదైన వైద్యం

80 రోజుల తర్వాత కోలుకున్న వైనం

చింతూరు, ఆగస్టు 23: ఏజెన్సీలో అప్పుడే పుట్టిన బిడ్డ ప్రాణపాయ స్థితిలో ఉండడంతో 80 రోజులు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించి తల్లి కళ్లల్లో ఆనందం నింపారు. వీఆర్ పురం మండలం దారపల్లి గ్రామానికి చెందిన అందేలా సుభద్ర ఏడవ నెలలోనే పురిటి నొప్పులు వస్తున్నాయని జూన్ 3న చింతూరు కమ్యూనిటీ హెల్త్ సెంటరుకు వచ్చింది. ఆమె మగ శిశువుకు జన్మనివ్వగా బరువు సుమారు 0.936 గ్రాములు మాత్రమే ఉంది. సూపరింటెండెంట్ డాక్టర్ ఎంవీ కోటిరెడ్డి, ఎస్ఎన్‌సీయూ సిబ్బంది శిశువు ప్రాణపాయ స్థితిని గుర్తించారు. నెలలు పూర్తిగా నిండకపోవడంతో తల్లి గర్భంలో అవయవాల ఎదుగుదల పూర్తిగా లేదని తెలిపారు. మెరుగైన వైద్యం కోసం భద్రాచలం లేదా ఖమ్మం తరలించాల్సి వస్తుందని తల్లిదండ్రులకు చెప్పారు. ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో వాళ్లు వెళ్లడానికి నిరాకరించారు. దీంతో చింతూరులోనే వైద్యం చేసేందుకు నిర్ణయించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంవీ కోటిరెడ్డి నిరంతర పర్యవేక్షణలో చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ హర్ష, ఎస్ఎన్‌సీయూ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉమర్ అత్యవసర చికిత్స మందులను వినియోగించి సుమారు 80 రోజులు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించారు. దీంతో శిశువు బరువు 2.800 కేజీలకు పెరిగింది. శుక్రవారం వైద్యుల పర్యవేక్షణలో శిశువును తల్లికి అప్పజెప్పి డిశ్చార్జి చేశారు. కాగా ఎస్ఎన్‌సీయూ ద్వారా అందుతున్న సేవలను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య పరిశీలించి సూపరింటెండెంట్‌ను, వైద్యాధికారులను, ఎస్ఎన్‌సీయూ సిబ్బందిని అభినందించారు. సీహెచ్‌సీలో ఈ సంవత్సరంలో బరువు తక్కువగా ఉన్న 65 మంది పిల్లలకు సేవలందించామని సూపరింటెండెంట్ తెలిపారు. కార్యక్రమంలో పిడియాట్రిషన్ డాక్టర్ హర్ష, డాక్టర్ ఉమర్, ఎస్ఎన్‌సీయూ సిబ్బంది పాల్గొన్నారు.

స్వగ్రామానికి బయల్దేరి... విగతజీవిగా మారి

కుమారుడి ఆరోగ్యం బాగోలేదని మనస్థాపంతో కార్మికుడి ఆత్మహత్య

ప్రత్తిపాడు, ఆగస్టు 23: కుమారుడి ఆరోగ్యం బాగోలేదని మనస్థాపంతో తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం లంపకలోవ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, కార్మికుడి సహచరులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... మండలంలోని లంపకలోవ వీరభద్ర ఎక్స్‌పోర్ట్స్ కంపెనీలో ఒడిసా రాష్ట్రం నరాల జిల్లా కలకంటికి చెందిన పప్పు మంగరాజు (21) కార్మికుడిగా పని చేస్తున్నాడు. స్వగ్రామంలో భార్య, పిల్లలను విడిచిపెట్టి కొన్ని సంవత్సరాలుగా ఇక్కడే పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. కుమారుడి ఆరోగ్యం బాగోలేదని రెండు రోజుల క్రితం భార్య ఫోను చేసి చెప్పింది. దీంతో మంగరాజు స్వగ్రామం వెళ్లేందుకు గురువారం సామర్లకోట రైల్వేస్టేషన్‌కు వెళ్లాడు. అయితే వెనక్కు మళ్లి తాను చేస్తున్న కంపెనీ వద్దకు వచ్చేశాడు. శుక్రవారం అక్కడికి సమీపంలోని తోటలో మామిడి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సహచరులు గుర్తించి ఒడిసాకు చెందిన సూపర్‌వైజరు ఫాల్గుణకు సమాచారం తెలపడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఎం.శేఖర్‌బాబు, ఎస్ఐ ఎం.పవన్‌కుమార్, పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఉరి వేసుకున్న కార్మికుడిని పరిశీలిస్తున్న పోలీసులు

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఇస్కాన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 23: రాజమహేంద్ర వరంలోని ఇస్కాన్ మందిరంలో జరుగుతున్న శ్రీకృష్ణాష్టమి జన్మాష్టమి వేడుకలు 5వ రోజుకు చేరాయి. శుక్రవారం విశ్వశాంతి మహాయజ్ఞం, శ్రీకృష్ణ లీలా కథామృత ప్రవచనం, రాధాకృష్ణుల వాహన సేవ, కూచిపూడి నృత్యాలు, పవళింపు సేవా జరిగాయి. మందిర కమిటీ ఛైర్మన్ శివానంద నిమాయిదాస్, సభ్యులు శ్యామంగ శ్రీనివాస్, రవీంద్ర చక్రదాస్, హేమా నిమాయిదాస్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఏజెన్సీ సమాచారం



బోలగొండ గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషదేవి

కొండరెడ్ల గ్రామాల అభివృద్ధికి చర్యలు

● బోలగొండ గ్రామసభలో ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, ఆగస్టు 23: ఏజెన్సీలో కొండరెడ్ల (పీవీటీజీ) గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశపెట్టాయని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి పేర్కొన్నారు. మండలంలోని బోలగొండ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభకు ఆమెతోపాటు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్‌కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులను సర్పంచ్‌ల ఆధ్వర్యంలో తీర్మానించాలన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ వంద రోజుల పని కల్పిస్తామన్నారు. అటవీహక్కులు పట్టాలు పొందిన రైతులకు 50 రోజులు అదనంగా ఉపాధి పనులు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లాల సీతమ్మ, ఏపీడీ జి.శ్రీనివాసరావు, ఏపీవో బి.సత్యనారాయణ, వైద్యాధికారి షాహిన్, పంచాయతీ కార్యదర్శి విశ్వాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఫోక్సుపేటలో జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పెద గెద్దాడలో సర్పంచ్ వడగల ప్రసాద్ బాబు అధ్యక్షతన జరిగిన గ్రామసభకు మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నోడల్ అధికారి ఎస్‌వీబీ రాజు, గ్రామస్తులు కడబాల అబ్బాయి రెడ్డి, రవికుమార్, టి.వెంకటరెడ్డి, ముర్ల అన్నారం, అన్నిక అప్పారావు, నేసిక భద్రం, పట్టెం వెంకటరావు, మిరియాల దుర్గాప్రసాద్, సీసీ పద్మ, పత్రి బాలరాజు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని గడువకుర్తిలో సర్పంచ్ సవిరాల చంద్రుడు అధ్యక్షతన జరిగిన గ్రామసభకు ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజల నుంచి తీసుకున్న వినతులను తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎంఈవో సత్యనారాయణదొర తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే గ్రామసభల లక్ష్యమని గన్నవరం గ్రామ సచివాలయ ప్రత్యేక అధికారి ఏఎల్ఈ ప్రసాద్ అన్నారు. మండలంలోని 12సచివాలయాల్లో గ్రామసభలు నిర్వహించారు. మురుమూరులో గ్రామస్థాయి అధికారులు, ప్రత్యేక అధికారి మధ్యాహ్నం 12 గంటల వరకు హాజరుకాలేదు. వారి తీరుపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు. ప్రజలంతా తిరిగి వెళ్లిపోతున్న సమయంలో అధికారులు సభకు వచ్చారు.

అడ్డతీగల: మండలంలోని 22 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. డి.భీమవరం గ్రామసభకు ఎమ్మెల్యే శిరీషదేవి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. రహదారులు, డ్రైన్లు తదితర అవసరాలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించామని ఎంపీడీవో విజయరంగారావు తెలిపారు.

కూనవరం: మండలంలోని 16 పంచాయతీల్లో ఒకేసారి గ్రామసభలు నిర్వహించారు. సుమారు రూ.50కోట్ల ప్రతిపాదనలతో ప్రజల నుంచి దరఖాస్తులు వచ్చాయి. వీటిలో సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీలు, డోర్లకు ఎక్కువ శాతం దరఖాస్తులు వచ్చాయి. వీటితోపాటు పశువుల షెడ్లకు సైతం దరఖాస్తులు వచ్చాయి. ఉపాధి హామీ ఏపీవో శ్రీకాంత్, టీడీపీ నాయకులు ఎడవిల్లి భాస్కరరావు, పాయం మధు, మేజర్ పంచాయతీ సర్పంచ్ హేమంత్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పెంటయ్య, బండారు సాంబశివరావు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలవ్యాప్తంగా శుక్రవారం జరిగిన జాతీయ ఉపాధి హామీ పనుల గుర్తింపు గ్రామసభల్లో ప్రజలు తమ సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలియజేశారు. 19 పంచాయతీల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన జరిగిన సభలకు మండల అధికారులు నోడల్ అధికారులుగా వ్యవహరించారు. తహసీల్దారు కరక సత్యనారాయణ, ఎంపీడీవో యాదగిరేశ్వరావు పాల్గొన్నారు.

దేవీపట్నం: మండలంలోని గ్రామాల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన అధికారుల ఆధ్వర్యంలో గ్రామసభలు జరిగాయి. ఉపాధి హామీతో పాటు పలు అభివృద్ధి పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా పునరావాస కాలనీల్లో శ్మశానం అభివృద్ధి, చేతిపంపులు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మొదలైన సమస్యలను టీడీపీ, బీజేపీ నాయకులు గ్రామస్తులతో కలిసి గ్రామసభలో అధికారులకు లిఖితపూర్వకంగా అందజేశారు.

ఘనంగా 'టంగుటూరి' జయంతి

రంపచోడవరం, ఆగస్టు 23: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతి ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్‌కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీవో (జి) సీహెచ్ శ్రీనివాసరావు, పరిపాలనాధికారి డీఎస్వీ రమణ, పీహెచ్‌వో చిట్టిబాబు, ఎస్‌వో మార్తమ్మ పాల్గొన్నారు.



చింతూరు తహశీల్దారుగా చిరంజీవి

చింతూరు, ఆగస్టు 23: చింతూరు నూతన తహశీల్దారుగా ఎస్.చిరంజీవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆయన చింతూరు డివిజన్‌లో ఆర్‌అండ్‌ఆర్ విభాగంలో డిప్యూటీ తహశీల్దారుగా విధులు నిర్వర్తించారు. ఇప్పుడు తహశీల్దారుగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

దుర్గమ్మదేవి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

రంపచోడవరం, ఆగస్టు 23: స్థానిక మార్కెట్ సమీపంలో దుర్గమ్మదేవి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ శంకుస్థాపన చేశారు. కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. పునర్నిర్మాణ కమిటీ ఛైర్మన్ వై.నిరంజనీదేవి, సూరిబాబు, తిరివీధి వెంకటేశ్వరరావు, వైవీ రమణయ్య, అడబాల బాపిరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వృథాగా సత్యసాయి గోదావరి తాగునీరు

దేవీపట్నం, ఆగస్టు 23: మండలంలోని కమలంపాలెం గ్రామంలో శ్రీసత్యసాయి గోదావరి తాగునీరు వృథాగా పోతోంది, సుమారు ఎనిమిది నెలలుగా పైపు లైన్ల నుంచి నీరు లీకవుతున్నా సిబ్బంది పట్టించుకోవట్లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో తాగునీరు లేక ప్రజలు కిలోమీటర్ల దూరం వెళ్లి దాహం తీర్చుకుంటున్నారు. మరోపక్క శ్రీసత్యసాయి గోదావరి మంచినీరు అందక పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు ఇబ్బందిపడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని జనసేన మండల శాఖ అధ్యక్షుడు చారపు వెంకటరాయుడు, జనసైనికులు కొమరం దొరబాబు, కారం దుర్గాప్రసాద్, చారపు ఉదయ్‌కిరణ్, చారపు రమేష్,మధు, పవన్‌కుమార్‌రెడ్డి కోరుతున్నారు.



కారు బోల్తా

రాజవొమ్మంగి, ఆగస్టు 23: మండలంలోని వట్టిగెడ్డ గ్రామంలో జాతీయ రహదారిపై కారు అదుపు తప్పిబోల్తా పడింది. లాగరాయి గ్రామానికి చెందిన వంతు లక్ష్మీబాయి సింగంపల్లి ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం పాఠశాల నుంచి సహచర ఉపాధ్యయురాలు కె.లక్ష్మీతో కలిసి ఇంటికి తిరిగి వెళ్తుండగా మార్గమధ్యంలో వట్టిగెడ్డ వద్ద కారు అదుపు తప్పి రోడ్డు పక్కనఉన్న గుంతలో బోల్తాపడింది. స్థానికులు స్పందించి మహిళలను బయటకు తీశారు. వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

ఆర్ట్స్ కళాశాలలో 29న జాతీయ వర్క్‌షాపు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 23: రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 29న కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహణ అవకాశాలు, అవరోధాలు అనే అంశంపై జాతీయస్థాయి వర్క్‌షాపు నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ వర్క్‌షాపులో తమిళనాడు కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఏ.చంద్రమోహన్, అమరావతి ఎస్ఆర్ఎం వర్సిటీ ప్రొఫెసర్ సత్యనారాయణ దువ్వూరి ముఖ్య ఉపన్యాసకులుగా పాల్గొననున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే, వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి పీవీవీ సత్యనారాయణ, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

● శుక్రవారం జాతీయ అంతరిక్ష దినం సందర్భంగా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులతో అంతరిక్ష విజ్ఞానం-ఆవశ్యకత అనే అంశంపై అవగాహన నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్ నిర్వహించారు. భౌతికశాస్త్ర విభాగాధిపతి కె.లక్ష్మి, భౌతికశాస్త్ర అధ్యాపకులు పాల్గొన్నారు.

●బీకాం విద్యార్థులకు ఉద్యోగావకాశాలు పొందడానికి బ్యాంకింగ్ సెక్టార్‌కు సంబంధించి మూడు రోజులుగా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జరుగుతున్న ట్రైనింగ్ ఆన్ ట్రైనర్స్ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ స్కిల్ సెక్టార్ కౌన్సిల్, క్రిస్ప్‌ఫీ ఆధ్వర్యంలో దీన్ని నిర్వహించారు.

దేశానికి పల్లెలు పట్టుగొమ్మలు

● గ్రామ సభలతోనే సమస్యల పరిష్కారం
● గ్రామసభల ప్రారంభంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల



రాజమహేంద్రవరంరూరల్: పిడింగొయ్యి గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల



అనపర్తి: మహేంద్రవాడ గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి



కడియం: దామిరెడ్డిపల్లిలో సర్పంచ్ సత్యస్వరూప అధ్యక్షతన గ్రామసభ దృశ్యం



రాజానగరం: కానవరం గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

రాజమహేంద్రవరంరూరల్ ఆగస్టు 23: దేశానికి పల్లెలు పట్టుగొమ్మలని పల్లెలు బాగుంటేనే రాష్ట్రంతోపాటు దేశం అభివృద్ధి చెందుతుందని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రూరల్ మండల పరిధిలోని పిడింగొయ్యి పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ గ్రామసభలు నిర్వహించడం ద్వారా సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించే వీలుంటుందన్నారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల సారథ్యంలో పారదర్శక పాలన అందించే దిశగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించామన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 13వేల పైచిలుకు పంచాయతీలకు ఒకేరోజు గ్రామసభలు నిర్వహించడం కొత్త అధ్యాయమన్నారు. మండలం పరిధిలో గల తొర్రేడు, వెంకటనగరం, కాతేరు, కోలమూరు, హుకుంపేట, బొమ్మూరు, శాటిలైట్ సిటీ, రాజవోలు గ్రామాల్లో ఆయా గ్రామసభల ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. గ్రామస్తులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ శ్రీరాములు, రూరల్ యంపిడీవో శ్రీనివాసరావు, మండల ప్రత్యేకాధికారి జ్యోతి, మండల వ్యవసాయాధికారి భీమరాజు, బివి సత్యవతి, సంపత్, మహేష్, బి శ్రీనివాసరావు,కిరణ్ చాంద్‌కుమార్, డి బాబూరావు, గ్రామ కార్యదర్శులు రూప్‌చంద్, విజయ్‌రెడ్డి, హనుమంతరావు,టి కృష్ణ, వెంకట్రావు, కాశీ విశ్వనాద్, శ్రీనివాసరెడ్డి శకుంతల, రాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండటమే గ్రామసభ

కడియం: రైతులకు, పేదలకు, బలహీనవర్గాలకు 87 రకాల పథకాలు కూటమి ప్రభుత్వం అమలుచేస్తుందని రాజమహేంద్రవరంరూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. శుక్రవారం కడియం మండలం వేమగిరిలో జరిగిన గ్రామసభకు ఎమ్మెల్యే గోరంట్ల ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్వాకం వలన గ్రామాల్లో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించడానికే గ్రామసభలు ఏర్పాటు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, ప్రత్యేకాధికారి సుజాత, ఎంపీడీవో కె.రత్నకుమారి, డీఆర్‌డీఏ పీడీ ఎన్వీవీఎస్ మూర్తి, కూటమి నాయకులు చెల్లుబోయిన శ్రీను, వెలుగుబంటి నాని, పితాని శివరామకృష్ణ, అల్లంపల్లి ప్రసాద్, గుత్తుల కృష్ణ, యనమదల రాజు, వాసంశెట్టి నాగబాబు, సూరపురెడ్డి జానకీరామ్, పరిమి మణికంఠ, కార్యదర్శి రాజశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

● రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లు కృషి చేస్తున్నారని కూటమి పాలనలో గ్రామాలు తద్వారా రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని దామిరెడ్డిపల్లి సర్పంచ్ ముద్రగడ సత్యస్వరూప తెలిపారు. సర్పంచ్ ముద్రగడ సత్యస్వరూప అధ్యక్షతన శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఉపసర్పంచ్ ముద్రగడ వీరేష్, ఎంపీటీసీ విత్తనాల సాయి, షేక్ సిద్దయ్య, రంపం గోపాలకృష్ణ, పంచాయతీ వార్డుమెంబర్లు, కార్యదర్శి బొర్రా ప్రభాకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో పల్లెలు పాత్ర కీలకం: ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం: దేశాభివృద్ధిలో గ్రామ పంచాయతీలు కీలక భూమిక పోషిస్తాయని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణచౌదరి అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా శుక్రవారం నియోజకవర్గంలో పలుగ్రామాల్లో తలపెట్టిన గ్రామసభల్లో వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా కానవరంలో జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. స్థానిక పాలన చరిత్రలో ఇదో సరికొత్త సువర్ణాధ్యాయంగా నిలుస్తుందన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యదర్శి బీవీఆర్ చౌదరి మాట్లాడుతూ మన పరిపాలన మన గ్రామ స్వరాజ్యం దిశగా ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

వాడి వేడిగా దివాన్‌చెరువు గ్రామసభ

దివాన్‌చెరువు: జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామసభ దివాన్‌చెరువులో శుక్రవారం వాడిగా వేడిగా సాగింది. స్థానిక గ్రామసచివాలయం-1 వద్ద ఏర్పాటుచేసిన గ్రామసభకు గ్రామస్తులు, కూటమి నాయకులు హాజరై గ్రామంలోని పలు సమస్యలను సభ దృష్టికి తెచ్చి వాటి పరిష్కారానికి చర్యలు చేట్టాలని కోరారు. మండలపరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వంక మల్లిబాబు మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులలో దివాన్‌చెరువు గ్రామపంచాయతీకి మంజూరైన నిధుల వివరాలు తెలపాలని కోరారు. పంచాయితీకి ఎన్నిక జరగకపోవడంతో ఈనిధులు మంజూరు కాలేదని పంచాయతీ కార్యదర్శి వివరించారు. గ్రామస్తులకు గతంలో గోదావరి జలాలను తాగునీరుగా అందించేవారని, ఆతర్వాత ఎందుకు నిలిపివేశారని కూటమి నాయకుడు యర్రంశెట్టి శ్రీను అధికార్లను నిలదీశారు. తక్షణం తిరిగి గ్రామంలో ప్రజలకు గోదావరి జలాలు అందించాలని డిమాండ్ చేశారు. టీఎన్‌టీయూసీ అధికార ప్రతినిధి దాసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో దివాన్‌చెరువులో జరిగిన ఉపాధిపనుల సామాజిక తనిఖీ నివేదిక వివరాలను తెలపాలని కోరారు. గ్రామంలో పశువుల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని ఆర్యాపురం అర్బన్ బాంకు డైరెక్టరు నీలపాల పండు కోరారు. గ్రామస్తులు యర్రంశెట్టి నాగుమాస్టారు, ముప్పనపల్లిరాజు, నాగార్జున తదితరులు అనేక సమస్యలను అధికార్లకు వివరించి వాటిని పరిష్కరించాలని కోరారు.

రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి

కోరుకొండ: గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో నిర్వీర్యం అయిపోయిందని దానిని సరిచేసే బాధ్యతలో పాలకులు, అధికారులతోపాటు ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మె ల్యే బత్తుల బలరామకృష్ణ పిలుపునిచ్చారు. కోరుకొండ మండలం బూరుగుపూడి గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామసభ ద్వారా గ్రామాభివృద్ధికి అందరూ బాధ్యత తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఉపాధి హామీ గ్రామసభల ద్వారా కొత్తపనులు, పంత రోడ్లు, సీసీ రోడ్లు, డ్రైన్‌లు నిర్మాణం,చెరువులు ఆధునీకరణ, మరమ్మతులు, పంట కాలువల అభివృద్ధి, మంచినీటి సమస్యలపై ఉపాధి హామీ ద్వారా పనులు చేసుకోవచ్చన్నారు. టీడీపీ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ మన పరిపాలన గ్రామ స్వరాజ్య దిశగా ప్రజలు భాగస్వామ్యం అవుతూ ముందుకు వెళితే ప్రతి గ్రామ పంచాయతీ అభివృద్ధిపథంలో ముందుకు వెళతుందన్నారు. ఎంపీడీవో నరేష్‌కుమార్, పలువురు మండల పరిషత్ అధికారుల, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, టీడీ పీ రాష్ట్ర కార్యదర్శులు తనకాల నాగేశ్వరరావు, కంటే నాగ కేశవరావు, డాక్టర్ అడపా శ్రీనివాస్, గండి విజయ్‌కుమార్, పలువురు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులను ఎమ్మెల్యే బలరామకృష్ణ, బొడ్డు వెంకటరమణచౌదరిలను సన్మానించారు.

గ్రామ సభలు విజయవంతం: ఎంపీడీవో

రంగంపేట: మండలంలో గల ఆయా గ్రామాల్లో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం, ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖామంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్ నిర్దేశించిన ఉపాధిహామీ గ్రామసభలు విజయవంతంగా జరిగాయని రంగంపేట ఎంపీడీవో పి.వెంకటరత్నం తెలిపారు. ఈ సందర్భంగా వడిశలేరులో గ్రామ సర్పంచ్ కొల్లాటి శ్యామలావతి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ గ్రామ సభలలో వేతనదారుల హక్కులు, బాధ్యతలు తెలియజేయడం, గత సంవత్సరంలో మంజూరైన ప్రగతిలో ఉన్న పనులను, తదితర అంశాల గురించి వివరించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఆళ్ళ గోవింద్, ఆయా గ్రామాల కూటమి నాయకులు, జడ్పీటీసీ సభ్యులు, జడ్పీకోఆప్షన్ సభ్యులు,ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

●ఉపాధిహామీ పథకం పనులతోనే గ్రామ అభ్యుదయం సాధ్యమని రంగంపేట మండలం మర్రిపూడి గ్రామంలో సర్పంచ్ వేము మాదవి అధ్యక్షతన, కార్యదర్శి గౌరీశాంతి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన గ్రామసభలో కూటమి నాయకుడు పుట్టా సోమన్నచౌదరి పేర్కొన్నారు. గ్రామంలో 950 కుటుంబాలకు చెందిన 1450 మంది ఉపాధి హామీ కూలీలుగా ఉన్నట్టు చెప్పారు. వచ్చే ఏడాదికి శ్మశానవాటిక, చాగల్నాడు కాలువ అభివృద్ధి వంటి సుమారు 95 పనులను గ్రామసభ ఆమోదించిందన్నారు.

ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాభివృద్ధి

ధవళేశ్వరం: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని రూరల్ తహసీల్దార్ జె.రమ్య అన్నారు. శుక్రవారం ఉదయం ధవళేశ్వరం గ్రామ పంచాయతీ ఆవరణలో ప్రత్యేకాధికారి డి.బాలశంకర్రావు అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభకు ముఖ్యఅతిథిగా రూరల్ తహసీల్దార్ జె.రమ్య హాజరయ్యారు. పంచాయతీ కార్యదర్శి సూరిబాబు గ్రామసభ అజెండా, మంజూరైన పనులు, వివిధ దశల్లో ఉన్న పనుల వివరాలను సభకు వివరించారు. టీఎన్‌టీయూసీ నాయకుడు ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ యర్రమోతు ధర్మరాజు, పిన్నంటి ఏకబాబు తదితరులు మాట్లాడుతూ గ్రామంలో 33 ఏళ్ళ కిందట వేసిన మంచినీటి పైపులైన్‌లు పలు చోట్ల పాడైపోయి మంచినీరు లీకై వృథాగాపోతుందని దీనిని అరికట్టాలని కోరారు. గ్రామసభలో నాయకులు పండూరి అప్పారావు, ఆళ్ళ ఆనందరావు, గుర్రాల వెంకట్రావు, ఒంటెద్దు స్వామి, పన్నాల వెంకటలక్ష్మి, యడ్ల మహేష్, బీరా జయప్రకాష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

● ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి: ప్రజాభీష్టానికి అనుగుణంగా గ్రామాల్లో గ్రామసభల ద్వారా పనులను గుర్తించి గ్రామాలను అభివృద్ధి చేయడమే ఎన్డీయే కూటమి ధ్యేయమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అనపర్తి మండలం మహేంద్రవాడలో సర్పంచ్ మల్లిడి సూర్యప్రభ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా రోడ్ల నిర్మాణాలతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఒక్క టీడీపీ, కూటమి ప్రభుత్వాల సమయంలోనే రోడ్లు అభివృద్ధి చెందుతాయన్నారు. గ్రామసర్పంచ్ నుంచి ముఖ్యమంత్రి వరకు ప్రజలు ఎన్నుకున్నవారేనని పదవి అనేది బాధ్యతగా తీసుకోవాలని కేవలం సేవ మాత్రమేనని గ్రామాల అభివృద్ధికి రాజకీయ బేషజాలను పక్కనపెట్టి ప్రతిప్రజాప్రతినిధి పనిచేయాల్సిన అవసరంఉందన్నారు. అన్నిచోట్ల గ్రామసభలు విజయ వంతంగా ముగిశాయి. ఎంపీడీవో హిమమహేశ్వరి మాట్లాడుతూ ఉపాధి హా మీ పథకం ద్వారా చేపట్టనున్న పనుల విలువలను వివరించారు. కార్యక్రమం లో తహసీల్దార్ అనిల్‌కుమార్, సీఐ శివగణేష్, గ్రామకార్యదర్శి జి.పద్మావతి, అధికారులు, కూటమి నాయకులు కోనాల వెంకటరెడ్డి, వెలగల నారాయణ రెడ్డి, జనసేన అధ్యక్షుడు ఎస్ఆర్‌కే ప్రసాదరెడ్డి గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆంధ్రకేసరి సాహసం యువతకు స్ఫూర్తి

● అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజు

రాజమహేంద్రవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): దేశంకోసం తుపాకీ తూటాకు ఎదురుగా తన గుండెను నిలిపి 'ఆంధ్రకేసరి'గా జేజేలు అందుకున్న టంగుటూరి ప్రకాశం పంతులు నేటి యువతకు స్ఫూర్తి అని అడిషనల్ ఎస్పీ (పరిపాలన) ఎస్ఆర్ రాజశేఖర్ రాజు పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ప్రకాశంపంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించిన అనంతరం రాజశేఖర్‌రాజు మాట్లాడుతూ నిర్భీతి, నిజాయితీ, నిబద్ధత, పేదల క్షేమం కోసం పోరాడే తత్వం వంటి సుగుణాలే టంగుటూరిని ప్రజా జీవితంలో సింహంలా నెలబెట్టాయని కొనియాడారు. డీపీవో సిబ్బంది పాల్గొన్నారు. రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టంగు టూరి ప్రకాశం చిత్రపటానికి ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారా వు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర కేసరి ఆశయాలను సాకారం చేద్దామని పిలుపునిచ్చారు. అసోసియేషన్ అధ్యక్షుడు తవ్వల వీరేంద్రనాథ్, ఉపాధ్యక్షురాలు నాగదేవర స్వర్ణపాప, ప్రధాన కార్యదర్శి పెళ్లూరి రమేష్ పాల్గొన్నారు.

టంగుటూరి ప్రకాశం పంతులుకు ఘన నివాళి

రాజమహేంద్రవరంసిటీ/రూరల్: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు 153 జయంతిని శుక్రవారం నిర్వహించారు. కలెక్టరేట్‌లో టంగుటూరి చిత్రపటానికి జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు టంగుటూరికి పూలమాలవేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు సదా స్మరణీయులన్నారు. కార్యక్రమంలో



కలెక్టరేట్‌లో టంగుటూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న జేసీ చిన్నరాముడు

జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, ఇతర జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు. కార్యాలయ ఇన్‌చార్జి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పించారు. డాక్టర్ అభిషేక్‌రెడ్డి, డిప్యూటీ డెమో డాక్టర్ సత్యకుమార్ నల్లూరి పాల్గొన్నారు. రాజమహేంద్రవరం మునిసిపల్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులుకు అధికారులు నివాళులర్పించారు.

టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 23: పట్టుదలకు, ధైర్యానికి, త్యాగానికి ప్రతీకయైన టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. స్థానిక జేఎన్ రోడ్డులోని ఏకేసీ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమానికి ఆయన విచ్చేసి ప్రకాశం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాలేజీ సెక్రటరీ జమ్మి రామారావు, ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యేశ్వరి, ఛైర్మన్ జెట్టి ప్రసాదరావు, వర్తక ప్రముఖులు అశోక్‌కుమార్ జైన్, దుర్వాసుల సత్యనారాయణమూర్తి, ఆర్.సాయిబాబా పాల్గొన్నారు.

'విద్యార్థులలో స్నేహపూర్వక వాతావరణం ఉండాలి'

దివాన్‌చెరువు, ఆగస్టు 23 : విద్యార్థులలో స్నేహపూర్వక వాతావరణం ఉండాలని సీనియర్ సివిల్‌జడ్జి కె.ప్రకాష్‌బాబు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మాదకద్రవ్యాల నిషేధం, ఆంధ్రప్రదేశ్ ర్యాగింగ్ నిషేధచట్టం అనే అంశంపై శుక్రవారం న్యాయవిజ్ఞానసదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రకాష్‌బాబు మాట్లాడుతూ క్షణికానందం కోసం చేసే ర్యాగింగ్ వలన జీవితాలు నాశనమవుతాయని గుర్తుంచుకోవాలన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. వివిధ చట్టాలు గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. నన్నయ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య శ్రీనివాసరావు మాట్లాడుతూ ర్యాగింగ్, ఆల్కాహాల్, డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. న్యూరాలజీ వైద్యనిపుణుడు గోరంట్ల రవిరామ్ కిరణ్ మాట్లాడుతూ డ్రగ్స్ ద్వారా విద్యార్థులకు కలిగే ముప్పును అర్థమయ్యేవిధంగా వివరించారు. క్యాంపస్‌లో ర్యాగింగ్ చేయకుండా మంచిప్రవర్తనతో స్నేహపూర్వకంగా మెలుగుతామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. తొలుత దివంగత మాజీ సీఎం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విద్యార్థి అఫైర్స్ డీన్ ఆచార్య ఎస్.ఉదయభాస్కర్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ బి.కెజియారాణి, తదితరులు పాల్గొన్నారు.

చట్టంతో విభేదించిన బాలలకు న్యాయ సహాయం

రాజమహేంద్రవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): చట్టంతో విభే దించి జైళ్లలో ఉన్న బాలలను గుర్తించి న్యాయస్థానాల ముందు వారి బాల్యత్వాన్ని నిరూపించుకోడానికి చట్టపరమైన సహాయాన్ని అందించే లక్ష్యంతో 'యువతను పునరుద్ధరించడం' అనే దేశ వ్యాప్త కార్యక్రమం జరుగుతోందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన సెంట్రల్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేరం జరిగిన సమయంలో మైనర్‌లుగా ఉండి ప్రస్తుతం జైలులో ఉన్న వ్యక్తులను గుర్తించి తగిన న్యాయస్థానంలో బాల్యత్వాన్ని నిరూపించుకోడానికి అవసరమైన దరఖాస్తులను దాఖలు చేయడానికి ఈ ప్రత్యేక కార్యక్రమం ఉపకరిస్తుందన్నారు. అర్హులైన వారు డీఎల్ఎస్ఏ ద్వారా నియమించిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్, కారాగారంలోని పారాలీగల్ వాలంటీర్లతో దరఖాస్తు చేసుకొని న్యాయ సహాయం పొందాలన్నారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పించారు.

యువత అంతరిక్ష పరిశోధనలపై దృష్టి సారించాలి

రాజానగరం, ఆగస్టు 23 : అంతరిక్ష పరిశోధనలపై యువత దృష్టి సారించాలని జీజీయూ పరిశోధనాభివృద్ధి డైరెక్టర్ ఆర్ఎస్ రాజు ఆకాంక్షించారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ),గోదావరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(గైట్)అటానమస్ కళాశాలలో ఆటోమొబైల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అంతరిక్ష సాంకేతికతలో సవాళ్లు అనే అంశంపై శుక్రవారం సెమినార్ నిర్వహించారు. ఈ సమావేశంలో డైరెక్టర్ ఆర్ఎస్ రాజు మాట్లాడుతూ యువత అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి పెంపొందించుకోవాలంటూ అంతరిక్ష ప్రాముఖ్యత గురించి వివరించారు. ఆటోమొబైల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి వి.సుబ్రహ్మణ్యం వివిధ రకాల ఉపగ్రహ వాహననౌకలు, పనిచేసే తీరును వివరించారు. డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, జీజీయూ రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, ప్రిన్సిపాల్ టి.జయానందకుమార్, పాల్గొన్నారు.

'బిక్కవోలు ఆలయాల అభివృద్ధికి పాటు పడాలి'

అనపర్తి, ఆగస్టు 23: బిక్కవోలులో ప్రసిద్ధి చెందిన లక్ష్మీగణపతి ఆలయ నిర్మాణానికి ప్రతిఒక్కరూ రాజకీయాలకు అతీతంగా పాటుపడాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం బిక్కవోలులోని గోలింగేశ్వరస్వామి ఆలయ అన్నదాన మందిరంలో ఆలయాల అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసంగిస్తూ తెలుగు రాష్ట్రాలలోనే ప్రసిద్ధిగాంచిన బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయ నిర్మాణానికి దేవదాయశాఖ నుంచి అనుమతులు లభించనున్నాయన్నారు. ఆలయ నిర్మాణానికి అయ్యే ఖర్చును పూర్తిగా దేవదాయశాఖ భరిస్తుందన్నారు. ఇప్పటికే దాతలు ముందుకు వస్తున్నారని కూటమి నాయకుడు పల్లె శ్రీనివాస రెడ్డి, పాలచర్ల శివప్రసాద్ చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, సింగారపు రామారావు, చాగంటి సాయిబాబారెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కల వినియోగంపై అవగాహన ఉండాలి

గోకవరం, ఆగస్టు23: ఔషద మొక్కల వినియోగంపై ప్రతీఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆదర్శ విద్యా సంస్థల ఛైర్మన్ ప్రగళ్ళపాటి కనకరాజు అన్నారు. మండలంలోని కొత్తపల్లి ఆదర్శ పార్శశీ కళాశాల్లో ఔషద మొక్కల ఉపయోగాలపై శుక్రవారం నిర్వహించిన జాతీ య సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఔషధ మొక్కల ఉపయోగాలను విద్యార్థులు చిత్ర ప్రద ర్శన ద్వారా తెలుసుకున్నారు.

అంత్యానుప్రాస తొలి తెలుగు నిఘంటువు ఆవిష్కరణ



అంత్యానుప్రాస నిఘంటువును ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 23: తెలుగు వెలుగు ఆరిపిరాల నారాయణరావు ఆరేళ్లపాటు అవిశ్రాంతంగా శ్రమించి 50వేల పదాలతో రూపొందించిన తెలుగులో మొదటి అంత్యానుప్రాస నిఘంటువును స్థానిక ధర్మంచర కమ్యూనిటీహాలులో శుక్రవారం సాయంత్రం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ (ఇన్‌చార్జి) వై.శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి పురస్కార గ్రహీత, మహా మహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి అధ్యక్షతన జరిగిన సభకు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ అవధానం, పద్యం వంటి ఎన్నో సాహిత్య ప్రక్రియలున్న తెలుగు భాషలో అంత్యానుప్రాస నిఘంటువును ఆరిపిరాల నారాయణరావు రూపొందించడం అభినందనీయమన్నారు. తెలుగు భాషపై పట్టు, ప్రావీణ్యం ఉండాలంటే ఇలాంటి పుస్తకాల అవసరం ఎంతైనా ఉందన్నారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ చక్కటి భాష మాట్లాడడానికి భాషపై పట్టు సాధించటానికి, ఎన్నో విషయాలు తెలుసుకోవడానికి అంత్యానుప్రాస నిఘంటువు ఎంతో దోహదపడుతుందన్నారు. మల్కీపురం డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ పొన్నపల్లి శ్రీరామారావు సమీక్ష చేశారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, రాష్ట్రపతి పురస్కార గ్రహీత డాక్టర్ కర్రి రామారెడ్డి, నరసాపురం శ్రీవై ఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చినమిల్ల సత్యనారాయణ, సాహితీ ప్రియులు, పురప్ర ముఖులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిని ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 23: ఉమ్మడి జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కలిశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట వెళ్లి సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి వచ్చారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయంలో ఒక ప్రకటన విడుదల చేసింది.

సీఎంను కలిసిన ఎస్పీ నరసింహ

రాజమహేంద్రవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబును రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టులో ఎస్పీ నరసింహ కిషోర్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

నన్నయ వీసీ పదవి శెట్టిబలిజలకు ఇవ్వాలి

● రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 23: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో వైస్ చాన్సలర్ పదవి ఈసారి శెట్టిబలిజ సామాజిక వర్గంలో అర్హులైన వారికి ఇవ్వాలని రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తిలక్ రోడ్డులోని సంఘం కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానబోయిన రామారావు మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల్లో అత్యధిక జనాభా కలిగిన శెట్టిబలిజ సామాజిక వర్గానికి ఇప్పటివరకు యూనివర్శిటీ వీసీల నియామకాల్లో అన్యాయం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో స్థానిక ప్రజాప్రతినిధుల ఇష్టాన్ని అనుసరించి నియామకాలు జరిగాయన్నారు. యూనివర్శిటీ వీసీలతోపాటు అనేక ముఖ్యమైన నామినేటెడ్ పోస్టుల విషయంలో శెట్టిబలిజలకు ప్రాధాన్యమివ్వడం లేదన్నారు. సమావేశంలో నాయకులు బీఎస్వీ ప్రతాప్, సంఘం నాయకులు గుత్తుల గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



పల్లెలను అభివృద్ధి చేస్తా: వానపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న చంద్రబాబు



జై చంద్రబాబు: చంద్రబాబుకు ప్లకార్డులతో మహిళల స్వాగతం



మీకు నేనున్నా: గ్రామస్తులకు అభయమిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

సర్పంచ్ అడిగారని.. వానపల్లికి రూ.10 కోట్లు

కొత్తపేట, ఆగస్టు 23 : సీఎం చంద్రబాబునాయుడు వానపల్లిలో జరిగిన గ్రామసభలో సర్పంచ్ పల్లి భీమారావును మెచ్చుకున్నారు. మూడుసార్లు సర్పంచ్‌గా పనిచేస్తున్నాడంటే అతని అవినీతిరహితమైన పరిపాలనను ప్రజలు గుర్తించారన్నారు. అలాగే వానపల్లి అభివృద్ధికి 16 విభాగాల పనులకు సంబంధించి సుమారు రూ.10 కోట్లు అవుతాయని తనకు నివేదిక ఇచ్చారని, వాటన్నింటినీ మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలతో మమేకమై పనిచేస్తేనే ప్రజలే పట్టంగడతారని అన్నారు.



వానపల్లి గ్రామస్తులకు చంద్రబాబు అభివాదం

పల్లెకొచ్చిన.. చంద్రుడు

వానపల్లిలో చంద్రబాబు వరాల జల్లు

అమలాపురం/కొత్తపేట,ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పల్లెకు చంద్రుడొచ్చాడు..వెలుగులు తెచ్చాడు.. మీ సమస్యలన్నీ పరిష్కరిస్తానని వానపల్లిలో వరాలజల్లు కురిపించాడు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలంలోని వానపల్లిలో శుక్రవారం జరిగిన గ్రామసభలో సీఎం చంద్ర బాబు పాల్గొని మాట్లాడారు. పెట్టుబడి తగ్గించి ఆదాయం పెరిగేలా రైతులు వినూత్న ఆలోచనలతో ముందుకు వెళ్లాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా పెట్టుబడిని తగ్గించే ప్రకృతి సేద్యం చేసేలా ప్రోత్సహిస్తాం. రాష్ట్రంలో వర్షాలు పడడం శుభసూచకం. రాబోయే రోజుల్లో కరువు అనేది రాదు. ఇక్కడే పోలవరం ప్రాజెక్టు ఉంది. వీలైనంత త్వరలో దాని పూర్తిచేసి గోదావరి జిల్లాల ప్రజలకు మూడు పంటలకు నీళ్లిస్తామని స్పష్టంచేశారు. రైతులకు అన్ని విధాలా అండగా ఉంటామని చెప్పారు. ఇటీవల రూ.1,670 కోట్ల ధాన్యం బకాయిలను రైతులకు చెల్లించాం. 48 గంటల్లోనే ధాన్యం బకాయిలు చెల్లించే విధానాలతో ప్రభుత్వం ముందుకు వస్తోందని తెలిపారు. డ్వాక్రా సంఘాలకు రూపకల్పనచేసిన తానే.. ఆయా సంఘాల్లో ఉన్న మహిళల అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తానని చెప్పారు. గ్రామాల్లోని మహిళల ఉపాధి అవకాశాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉపాధి పొందుతూ ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తులు కింది స్థానంలో ఉన్న వారిని దత్తత తీసుకుని వారి ఆదాయం పెంచే విధంగా సహకరించాలని సూచించారు. జన్మభూమి స్ఫూర్తితో ఈ తరహా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. సభలో చంద్రబాబు ఎవరి పేర్లను ప్రస్తావించకుండానే ప్రసంగాన్ని ముగించేశారు. గ్రామసీమల అభివృద్ధికి తమ ప్రభుత్వం ఇస్తున్న అధిక ప్రాధాన్యతలను మాత్రం సభలో పదేపదే ప్రస్తావించడం ద్వారా ప్రజలను ఆకట్టుకోగలిగారు.

రెండున్నర గంటలపాటు గ్రామసభ

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాకతో సభా ప్రాంగణం కిక్కిరిసింది. రెండున్న గంటలపాటు సభ జరగ్గా గంటా 20 నిమిషాలపాటు చంద్రబాబు ప్రసంగం కొనసాగింది. మధ్యాహ్నం 2.20 గంటలకు అయినవిల్లిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్న కాన్వాయ్‌లో వానపల్లికి మధ్యాహ్నం 2.50 గంటలకు వానపల్లి చేరుకున్నారు. అక్కడ నాయకులు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. వానపల్లి పళ్లాలమ్మవారి ఆలయంలోకి వెళ్లిన చంద్రబాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం నేరుగా సర్పంచ్ పల్లి భీమారావు అధ్యక్షతన గ్రామసభ జరిగే వేదిక వద్దకు చేరుకున్నారు. సర్పంచ్, ఏపీడీల ప్రసంగం తరువాత నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు గంటా 20 నిమిషాల పాటు అనర్గళంగా ప్రసంగించడంతో ఎమ్మెల్యే బండారు, ఎంపీ హరీష్‌మాధుర్‌లకు మాట్లాడే అవకాశం రాలేదు. చంద్రబాబు ప్రసంగం తరువాత గ్రామస్తుల్లో కొందరికి అవకాశం కల్పించారు. చంద్రబాబు సభావేదికపైకి రాకముందు మాలమహానాడుకు చెందిన కొందరు కార్యకర్తలు సభలోకి ప్రవేశించడంతో వారిని గుర్తించిన పోలీసులు తక్షణమే సభాప్రాంగణం నుంచి బయటకు తీసుకెళ్లారు. వేదికపై కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తదితరులు ఉన్నారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతికి వేదికపై సీటు లేకపోవడంతో మీటింగ్ జరుగుతున్నంతసేపు నిలబడే ఉన్నారు. సభా వేదిక పక్కనే ఎమ్మెల్యేలు దాట్ల సుబ్బరాజు, గిడ్డి సత్యనారాయణ, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, కోనసీమ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, ఆకుల రామకృష్ణతో సహా అనేకమంది కీలక నాయకులంతా సభావేదిక పక్కనే కుర్చీల్లో ఆశీనులు కావడం కనిపించింది.

- గ్రామాల రూపురేఖలు మారుస్తా
- డ్వాక్రా మహిళల అభివృద్ధికి కృషి
- రైతులకు అండగా ఉంటా
- మూడు పంటలకు నీళ్లిస్తా
- పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తా
- తోటివారిని దత్తత తీసుకోండి
- ఉమ్మడి జిల్లాలో సీఎంగా తొలిసభ సక్సెస్



సీఎంతో రేజీనాయుడు



మీ వెంటే బాబు: గ్రామసభకు హాజరైన జనం



బాబుతో పోలవరం ప్రాజెక్టు అధికారి



బాబుకు యువకుడి జ్ఞాపిక



సీఎంకు సమస్య విన్నవిస్తున్న వృద్ధ దంపతులు



లక్ష్మణరావుకు అభినందన

సర్‌ప్రైజ్ విజిట్లు చేస్తా : సీఎం చంద్రబాబు

కొత్తపేట, ఆగస్టు 23: రాష్ట్రంలో ఎక్కడ అవినీతి జరిగినా తనకు సమాచారం వస్తుందని, ఆ ప్రాంతాల్లో సర్‌ప్రైజ్ విజిట్లు చేస్తానని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అధికారులు అందరూ నిబద్ధతతో పనిచేయాలి. నేను ఏ ప్రభుత్వ కార్యాలయానికి వస్తానో ముందుగా ఎవ్వరికీ తెలియనివ్వను. ప్రజలతో మమేకమై ప్రజాప్రతినిధులు, అధికారులు పనిచేయాలని ఆయన సూచించారు.





ప్రజల సమస్యలు వింటున్న సీఎం చంద్రబాబు

మా గ్రామంలో ఫ్యాక్టరీ పెట్టించండి సార్..

ఒక యువకుడి కోరిక.. కలెక్టర్‌కు సీఎం ఆదేశాలు

అమలాపురం/కొత్తపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గ్రామసభలో సీఎం చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలో ఓ యువకుడు తాను మాట్లాడతానని పెద్దగా అరిచాడు.. ఇది గమనించిన సీఎం అతడిని వేదికపైకి పిలిచి మైకు ఇచ్చారు. అతను ఏఐ వస్తుంది కదా సార్ ఏం చేస్తారని ప్రశ్నించాడు. ఇంతలో మరో యువకుడు మాట్లాడేందుకు వేదిక దగ్గరికి వచ్చాడు. ఇటు రావయ్యా అంటూ అతడిని పిలిచి బాబు మైకు అందించారు. వేదికపై పాల్గొన్న అందరి పేర్లు సంబోధిస్తూ ఏలూరి శ్రీనివాసధనరాజు (రేజ్‌నాయుడు) ప్రసంగాన్ని ప్రారంభించాడు. అక్కడే ఉన్న మహిళలను చూపించి వీరంతా ఈ ఊరి నుంచి సుమారు 40 కిలోమీటర్లు వెళ్లి రవళి స్పిన్నింగ్ మిల్‌లో షిఫ్టుల వారీగా పనులు చేస్తున్నారు. ఊపిరితిత్తుల సమస్యలు వస్తున్నాయి. ఇక్కడే ఏదైనా మహిళలకు ఉపాధి కలిగే ఫ్యాక్టరీని ఏర్పాటు చేయండని అభ్యర్థించాడు. దానిపై చంద్రబాబు స్పందించి ఇక్కడ మహిళలకు ఉపాధి కలిగేలా ఫ్యాక్టరీ ఏదైనా నెలకొల్పేందుకు చర్యలు తీసుకోండని కలెక్టర్‌కు సూచించారు. ఎంతో మహిమగల అమ్మవారు పళ్లాలమ్మ తల్లి. ఆమె చుట్టూ ప్రకృతివనం ఒకటి ఏర్పాటు చేయండని అభ్యర్థించాడు. వెంటనే స్పందించిన చంద్రబాబు పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. నువ్వు ఏం చేస్తావని అతడిని అడిగినప్పుడు నేను ఆటో నడుపుతాను అని బదులిచ్చాడు. అయితే నీకు ఎలక్ట్రికల్ ఆటో తీసి ఇస్తా నడుపుకుంటావా అని చంద్రబాబు అనగా అందుకు ఆ యువకుడు ఈ రోడ్లలో ఎలక్ట్రికల్ ఆటో పనికిరాదు సార్ అంటూ సున్నితంగా తిరస్కరించాడు. సామాజిక స్పృహ ఉన్న ఇటువంటి యువకుడు సమాజానికి అవసరమంటూ చంద్రబాబు అభినందించారు. ఇక్కడ పరిశ్రమ ఏర్పాటుకు అవకాశాలను గుర్తించి బండారు సత్యానందరావు ద్వారా తనకు నివేదిక పంపాలని, వాటిని మంజూరు చేస్తామని చెప్పారు. గంధ్రోతు సతీష్ అనే యువకుడు మాట్లాడుతూ గౌతమీ గోదావరి నది మధ్యలో కృష్ణ జింకల సంరక్షణకు చర్యలు తీసుకోవడంతోపాటు టీడీపీని నమ్ముకుని ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న ఆకుల రామకృష్ణకు పార్టీ నామినేటెడ్ పదవి ఇవ్వాలని చంద్రబాబును అభ్యర్థించారు. వానపల్లి గ్రామానికి చెందిన కంచుస్తంభం లక్ష్మణరావు మాట్లాడుతూ మీతోనే రాష్ట్ర భవిష్యత్ అంటూ చెప్పడంతో సీఎం చంద్రబాబు అతడిని భుజం తట్టారు. అనంతరం చింతపల్లి కిరణ్, ఇళ్ల సత్తిబాబులకు ఎలక్ట్రికల్ బైక్‌లు, చల్లపల్లికి చెందిన పోలిశెట్టి వీరవెంకట సత్యనారాయణకు ఒక ఇల్లు, రూ.లక్ష ఆర్థిక సాయం చేయమని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌ను ఆదేశించారు.



దివ్యాంగుడి సమస్య వింటున్న చంద్రబాబు



చంద్రబాబుకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఎయిర్‌పోర్టులో చంద్రబాబుకు వీడ్కోలు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 23: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పర్యటనకు సీఎం హోదాలో తొలిసారిగా వచ్చిన చంద్రబాబుకు నాయకులు, అధికారులు ఘన వీడ్కోలు పలికారు. ఆయన కొత్తపేట మండలం వానపల్లిలో శుక్రవారం మధ్యాహ్నం సభ ముగించుకుని మధురపూడి ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. సీఎం చంద్రబాబుకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ డి.నరసింహకిశోర్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణుడు, టీడీపీ నాయకుడు బొడ్డు వెంకటరమణచౌదరి వీడ్కోలు పలికారు. చంద్రబాబును కలిసేందుకు ప్రజలు పెద్దఎత్తున ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు.



చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

డ్రైనేజీల్లేవ్.. రోడ్లూ లేవు!

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

స్వర్ణ గ్రామ పంచాయతీల పేరిట తెలుగుదేశం కూటమి ప్రభుత్వం శుక్రవారం జిల్లాలో నిర్వహించన గ్రామ సభలకు సమస్యలు పోటెత్తాయి. జనం తండోపతండాలుగా తరలివచ్చి సమస్యలు మొరపెట్టుకున్నారు. జిల్లాలో 299 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ప్రతి పంచాయతీలో డ్రైనేజీలు, రోడ్లు, పైపులైన్ లీకేజీలు, పారిశుధ్య, తాగునీరు, ఇళ్ల స్థలాలు తదితర సమస్యలు వెలుగులోకి వచ్చాయి. గత ప్రభుత్వంలో సమస్య చెప్పడానికి వెనుకడుగు వేసే పరిస్థితి ఉండేది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ సభలకు మాత్రం ప్రజలు స్వేచ్ఛగా వచ్చి తమ ఊరి సమస్యలను ఏకరవు పెట్టారు. గ్రామాల్లో రాజకీయ పార్టీనేతలు, స్థానిక ప్రజాప్రతినిధులే కాకుండా ప్రజలు సమస్యలను లేవనెత్తారు. సభా ముగింపులో ప్రజలు ఇచ్చిన విజ్ఞప్తులపై తీర్మానాలు చేశారు. వేలాది పనులపై తీర్మానాలు జరిగాయి. అన్ని అంశాలు కలుపుకుంటే సుమారు రూ.1000కోట్లకు పైగా వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ డ్రైనేజీ సమస్య ఉంది. సీసీ రోడ్ల సమస్య ఉంది. పైపులైన్ల సమస్య ఉంది. ఒక్కో పంచాయతీలో సుమారు 4 కిలోమీటర్ల నుంచి 5 కిలోమీటర్ల వరకూ డ్రైనేజీ సమస్యలు ఉన్నాయి.. కిలోమీటర్ల కొలదీ సీసీ రోడ్లు నిర్మించాల్సి ఉన్నట్టు తేలిసింది. డ్రైనేజీల నిర్మాణానికే సుమారు రూ.500 కోట్ల వరకూ అవసరం ఉంటుందని భావిస్తున్నారు. సీసీ రోడ్లకు నిధులు అవసరం. వీటన్నింటినీ ఉపాధిహామీ పథకం ద్వారా నిర్మించనున్నారు. వేగంగా నిధులు విడుదల చేసి అన్నీ ప్రాధాన్యతా క్రమంగా పనులు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. సీతానగరం మండలం ముగ్గళ్లలో 75 వర్కులకు తీర్మానం చేశారు. ధవళేశ్వరం సుమారు రూ.50 కోట్ల విలువైన వర్కులకు తీర్మానాలు చేసినట్టు సమాచారం. ఇలా ప్రతి గ్రామంలోనూ ప్రజలు చెప్పిన అంశాలను తీర్మానాలు చేశారు. కొన్ని చోట్ల ప్రజలు గతంలో పనులు చేయకపోవడాన్ని నిలదీశారు. దేవరపల్లి జగనన్న కాలనీల్లో ఇళ్ల మంజూరులో అన్యాయం జరిగిందని పలువురు వాపోయారు. అయితే ఆ పంచాయతీ వైసీపీ వార్డు సభ్యుడు పార్టీలకతీతంగా అర్హులకు ఇచ్చామని అనడంతో ఇళ్లు మంజూరుకానివారు తిరగబడ్డారు. గౌరీపట్నంలో భూహక్కు రీసర్వేలో అవకతవకలు జరిగాయని రైతులు ఫిర్యాదు చేశారు. ధవళేశ్వరంలో ఎన్నిసార్లు చెప్పి, మా డ్రైన్ల పట్టించుకోరేంటని కొందరు ప్రశ్నించారు. ఇలా జిల్లాలో రికార్డు స్థాయిలో గ్రామ సభలు జరిగాయి. ప్రారంభంలో మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాటకూటేశ్వరంలో మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ పి. ప్రశాంతి,ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి,నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వేంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకట్రాజు నియోజకవర్గాల గ్రామ సభల్లో పాల్గొన్నారు.

- ప్రజల చెంతకు చేరిన పాలన
- 299 పంచాయతీల్లో గ్రామసభలు
- ప్రజల నుంచి భారీ స్పందన
- ఎక్కడికక్కడ సమస్యలతో క్యూ
- సాయంత్రానికి తీర్మానాలు
- అంచనాలతో నివేదికలు

పల్లె సమస్యలన్నీ పరిష్కరిస్తాం

మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, ఆగస్టు 23 : రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో ఉన్న సమస్యలను సత్వరం పరిష్కరించే దిశగా గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దురేష్ అన్నారు. నిడదవోలు మండలం కాటకూటేశ్వరం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక సమస్యలు ప్రజల నుంచే తెలుసుకునేందుకు సభలు ఎంతో దోహద పడతాయన్నారు. గ్రామ సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించడంజరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ గ్రామ ప్రజల హక్కులు బాధ్యతలు తెలుసుకునేందుకు వేదిక గ్రామ సభలన్నారు. ఈ కార్య క్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, సర్పంచ్ కొయ్యల వెంకటేశ్వరరావు,వైస్ సర్పంచ్ కొప్పిశెట్టి మంగరాజు,ఎంపీడీవో పి.శామ్యూల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్ చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు

ఉపాధి పనుల్లో అవకతవకలపై నిలదీత..

నిడదవోలు మండలం డి.ముప్పవరం గ్రామ సభ రసాబాసగా మారింది.గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకలపై గ్రామస్తులు అధికారులను నిలదీశారు. ఉపాధి హామీ పనుల నిమిత్తం విడుదలైన నిధుల గురించి కల్పించిన పనిదినాల గురించి ప్రజలకు వివరణ ఇవ్వడంలో అధికారులు విఫలమయ్యారు.దీంతో గ్రామస్తులకు అధికారులకు మధ్య కొంత సేపు వాగ్వాదం జరిగింది.

ఏపీలో బీఆర్ అంబేడ్కర్ యూనివర్శిటీ

మనుగడ ప్రశ్నార్థకం

- విభజనం చట్టం ప్రకారం ముగిసిన గడువు
- 2024-25 ఫస్టియర్ అడ్మిషన్లు నిలిపివేత

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 23: సమైక్యాంధ్రలో 1982లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయ సెంటర్లను ఏర్పాటు చేశారు. నందమూరి తారక రామారావు టీడీపీని స్థాపించి తొలిసారిగా ప్రభుత్వం ఏర్పాటు చేశాక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో యూనివర్శిటీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి కొన్ని లక్షల మంది విద్యార్థులు డిగ్రీ, పీజీలు పూర్తి చేసుకుని ఉన్నస్థాయిలో స్థిరపడ్డారు. అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత 10వ షెడ్యూల్ ప్రకారం పదేళ్ల పాటు ఉమ్మడి కార్యాచరణలో ఇరు రాష్ట్రాల్లోను అంబేడ్కర్ యూనివర్శిటీ కేంద్రాలు నడిచాయి. ఏడాదికి ఆంధ్రప్రదేశ్‌లో 76 కేంద్రాల్లో డిగ్రీ, పీజీ కోర్సులను లక్షలాది మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు.2023-24 విద్యాసంవత్సరంతో రాష్ట్ర విభజన జరిగి పదేళ్ల గడువు ముగియడంతో విభజిత ఆంధ్రప్రదేశ్ అంబేడ్కర్ యూనివర్శిటీ కేంద్రాల్లో 2024-25 విద్యాసంవత్సరం అడ్మిషన్లు నిలిచిపోయాయి. ఇప్పటి వరకు సెకండ్, థర్డ్ ఇయర్ చదువుతున్న వారు, పీజీ కోర్సులు చదువుతున్న వారు కొనసాగుతుండగా ఫస్టియర్‌కు అడ్మిషన్లు బంద్ చేశారు. దీంతో యూనివర్శిటికీ సంబంధించి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. కొత్త రాష్ట్రంలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీకి రాజమహేంద్రవరం, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు తదితర నగరాలతో పాటు ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్‌లో సెంటర్లు ఉన్నాయి. వాటిలో అడ్మిషన్లు నిలిచిపోవడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా యూనివర్శిటీకి సంబంధించిన కార్యకలాపాలను ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సి ఉంది. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని సెంటర్‌లో ప్రతి ఏడాది సుమారు 2 వేల మంది అడ్మిషన్లు తీసుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఫస్టియర్‌కు అడ్మిషన్లు నిలుపుదల చేశారు. అయితే ఈ ఏడాది జూలై చివరిలో తెలంగాణలో ఫస్టియర్ అడ్మిషన్లు ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇంకా అడ్మిషన్లు ప్రారంభం కాకపోవడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. దీంతో విద్యార్థులు ఉద్యమానికి సన్నద్ధమవుతున్నారు.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

'కేసుల రాజీతో సమయం, డబ్బు ఆదా'


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సత్యవతి

కొవ్వూరు, ఆగస్టు 23: లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా చేసుకోవచ్చునని కొవ్వూరు ఇన్‌చార్జి 9వ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. శుక్రవారం కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎక్కువ కేసులు రాజీ చేసుకునే విధంగా కృషి చేయాలన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనం నిర్మించాలి

కొవ్వూరు ఎమ్మెల్యేకు పీడీఎస్‌యూ నాయకుల వినతి

కొవ్వూరు, ఆగస్టు 23: కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనం నిర్మించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును కలసి వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి మహర్షి మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా కొవ్వూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటుచేశారని, అయితే కళాశాలకు శాశ్వత భవనం లేపోవడంతో బాలుర జూనియర్ కళాశాలలో షిఫ్టులవారీగా తరగతులు నిర్వహిస్తున్నారు. దీని వల్ల విద్యార్థులు పూర్తిస్థాయిలో చదువుకోలేకపోతున్నారని, ఉత్తీర్ణత శాతం ఆశించిన స్థాయిలో రావడం లేదన్నారు. ఉదయం షిఫ్టుకి దూర ప్రాంతాల నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులు సమయానికి రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. షిఫ్టుల విధానం రద్దు చేసి ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు పూర్తి స్థాయిలో తరగతులు నిర్వహించాలన్నారు. దీనిపై ఎమ్మెల్యే ముప్పిడి స్పందిస్తూ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కాకి నాని, బి.వినోద్, ఎం.క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

కోట సత్తెమ్మకు సారె


కోటసత్తెమ్మకు సారె తీసుకొచ్చిన దారవరం గ్రామ మహిళలు

నిడదవోలు, ఆగస్టు 23: తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ దేవస్థానంలో శుక్రవారం శ్రావణ శుక్రవారం సందర్భంగా చాగల్లు మండలం దారవరం గ్రామానికి చెందిన 30 మంది మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉండ్రాజవరం: పాలంగిలో కనకదుర్గమ్మ ఆలయం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయం కమిటీ సభ్యులు ప్రసాదాలు అందజేశారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. మోర్తలోని విజయకనకదుర్గమ్మ ఆలయంలో భక్తులు పూజలు చేశారు.

దేవరపల్లి: దేవరపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహిళలు ప్రత్యేక కుంకుమపూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎమ్మార్పీఎస్ కార్యవర్గాన్ని బలపరచాలి

ఉత్తర కోస్తా జిల్లాల ఇన్‌చార్జి చిన సుబ్బారావు


బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నిడదవోలు, ఆగస్టు 23: ఎమ్మార్పీఎస్ ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులతో నూతన కార్యవర్గాన్ని బలపర్చాలని మండలాల వారీగా సభ్యులను ఏర్పాటు చేయాలని ఉత్తర కోస్తా జిల్లాల ఇన్‌చార్జి ముమ్మిడివరపు చిన సుబ్బారావు అన్నారు. శుక్రవారం నిడదవోలులో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల జిల్లా నాయకుల సమావేశం భీమడోలు కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చిన సుబ్బారావు మాట్లాడుతూ కూటమికి వ్యతిరేకంగా పనిచేసిన వారిని పక్కన పెట్టాలని కృష్ణ మాదిగ ఆదేశించారని, ఇందులో భాగంగా నిడదవోలుకు చెందిన కొందరు నాయకులను పక్కన పెట్టామన్నారు. 30 ఏళ్ల ఉద్యమ పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకరణ జరిగిందని, త్వరలోనే జాతీయ సమావేశం జరగనుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాన్ సూరి, కత్తి సోమరాజు, బంటుమిల్లి బాలు, కొత్తలిపల్లి గాంధీ, సతీష్ పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ ఓటరుగా నమోదుకు సెప్టెంబరు 3 గడువు

గోపాలపురం, ఆగస్టు 23: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకునేందుకు సెప్టెంబరు 3వ తేదీ వరకు గడువు ఉందని తహశీల్దార్ ప్రదీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్వరలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల నివాసియై ఉండి సెకండరీ స్కూల్, ఆపై విద్యాలయాల్లో పని చేసే ఉపాధ్యాయులు అర్హులన్నారు. గడిచిన ఆరేళ్లలో మూడేళ్ల పాటు, హైస్థాయి విద్యాలయాల్లో టీచర్‌గా పనిచేసిన వారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఫాం-19 పూర్తిచేసి తహశీల్దార్ లేదా ఎంపీడీవో కార్యాలయాల్లో సమర్పించాలన్నారు. ప్రభుత్వ హైస్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సంబంధిత హెచ్‌ఎం ద్వారా దరఖాస్తులు సమర్పించాలని, ప్రైవేటు పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు దరఖాస్తును తాము పనిచేస్తున్న పాఠశాల హెచ్‌ఎం సంతకం ద్వారా జిల్లా విద్యాశాఖధికారి వద్ద కౌంటర్ సిగ్నేచర్ చేయించి ఆ పాఠశాలలో పని చేస్తున్నట్టు రుజువుగా శాలరీ స్టేట్‌మెంట్ల స్లిప్‌లు మూడేళ్ల కాలానికి సమర్పించాలన్నారు. ఐటీఐలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సైతం డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్, డిప్యూటీ డైరెక్టర్ ఎంప్లాయ్‌మెంట్ ద్వారా ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ద్వారా ప్రైవేటు కళాశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఆర్‌ఐవో ద్వారా దరఖాస్తు సమర్పించాలన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా అందించాలి

నల్లజర్ల, ఆగస్టు 23: రేషన్ సరుకులు ప్రజలకు సక్రమంగా అందించాలని తహశీల్దార్ కృష్ణారావు, సివిల్ సప్లై డీటీ సత్యనారాయణరాజు అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూ అపరేటర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడుతూ సెప్టెంబరు 1వ తేదీ ఉదయం 6గంటల నుంచి పంపిణీ ప్రారంభం కావాలన్నారు. 10వ తేదినాటికి పూర్తిస్థాయి పంపిణీ జరిగే విధంగా కృషి చేయాలన్నారు. వచ్చే నెలకు సంబంధించి పంచదార, బియ్యం అందిస్తామనిన, డిసెంబరు నుంచి రాగులు, కందిపప్పు అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం అధ్యక్షులు చీమకుర్తి నరసింహమూర్తి, అచ్యుత భాస్కరావు, బాసింశెట్టి లక్ష్మణరావు, దూళిపాల వెంకన్న, కోమల నాగేశ్వరరావు, చంద్రం, నాగు, తాడిగడప మహేశ్, ఎండీయూ ఇశ్రాయేలు, దుర్గారావు, సుబ్బారావు పాల్గొన్నారు.

జాతీయ అంతరిక్ష దినోత్సవం



ఉండ్రాజవరం, ఆగస్టు 23: మండలంలోని కాల్ధరి నెం.3 పాఠశాలలో ఉపాధ్యాయురాలు పి.కుసుమ ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సొంతంగా తయారు చేసిన రాకెట్ బోధనోపకరణాలు, ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-3 వర్కింగ్ మోడల్స్‌ను విద్యార్థులకు కళ్లకు కట్టినట్లు చూపించారు. చిన్నపాటి అట్టముక్కలు, ప్లాస్టిక్ గొట్టాలు, చిన్నపాటి బల్బులు, విద్యుత్ తీగలు వంటి సామగ్రిని ఉపయోగించి చంద్రయాన్ 3 నమూనా బోధనోపకరణాన్ని తయారు చేసి, విద్యార్థులకు వివరించారు. తొలుత టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా చిత్రపటానికి ప్రధానోపాధ్యాయురాలు సుభద్రభాను పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆర్ట్స్ కళాశాలలో 29న జాతీయ వర్క్‌షాప్

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 23: రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 29న కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహణ అవకాశాలు, అవరోధాలు అనే అంశంపై జాతీయస్థాయి వర్క్‌షాపు నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ వర్క్‌షాపులో తమిళనాడు కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఏ.చంద్రమోహన్, అమరావతి ఎస్ఆర్ఎం వర్శిటీ ప్రొఫెసర్ సత్యనారాయణ దువ్వూరి ముఖ్య ఉపన్యాసకులుగా పాల్గొననున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే పాల్గొన్నారు.


కొవ్వూరు: దొమ్మేరు గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి


నల్లజర్ల: దూబచర్ల గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి


దేవరపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న తహశీల్దార్ రామలక్ష్మి


పెరవలి: ముక్కామలలో గ్రామ సభలో పాల్గొన్న గ్రామస్థులు

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- కూటమి ప్రభుత్వం గ్రామసభల నిర్వహణ
- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- పలుచోట్ల గ్రామ సభలు.. హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు
- వివిధ సమస్యలపై వినతుల స్వీకరణ

కొవ్వూరు, ఆగస్టు 23: గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడానికి కూటమి ప్రభుత్వం గ్రామసభలను నిర్వహిస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కొవ్వూరు మండలంలోని 16 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. దొమ్మేరు, పశివేదల గ్రామాల్లో ఎమ్మెల్యే ముప్పిడి పాల్గొని ప్రజలనుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొమ్మేరులో డంపింగ్ యార్డు నిర్మాణానికి ప్రభుత్వ స్థలం గుర్తించాలన్నారు. గ్రామ సభల్లో రాతపూర్వకంగా సమస్యలను అందజేయాలని, వాటిని నమోదు చేసి అన్ని ప్రభుత్వశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. న్నారు. నియోజకవర్గంలో మొట్టమొదటి ప్రాధాన్యం దొమ్మేరుకు ఇస్తానన్నారు. జగన్ సీఎంగా పనిచేసిన సమయంలో కనీసం పత్రికా సోదరులకు దొరకలేదన్నారు. బుల్లెట్‌ప్రూఫ్ కార్లలో ఎక్కడికెళితే అక్కడ చెట్లను నరుక్కుని రెడ్లంతా వెళ్లారే తప్ప ఏ గ్రామంలో ప్రజలను ఆదుకున్న దాఖలాలు లేవన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన 3నెలలకే ఎమ్మెల్యేలు గ్రామాలకు వెళ్లాలని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ పంపించారన్నారు. గ్రామీణ ప్రాంతాలను సస్యశ్యామలం చేయాలని ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కాగా దొమ్మేరులో రూ.58 లక్షలతో నిర్మించనున్న సీసీ డ్రైను, రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తానేటి కుమారి, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, ఎంపీపీ కాకర్ల నారాయుడు, కలగర సుబ్బారావు, యలమర్తి రాంబాబు, వాడవెల్లి సూరిబాబు, ఆసపు సరోజిని, కలగర హరిబాబు, కేవీకే రంగారావు, గంగుమళ్ళ స్వామి, ఎంపీడీవో కె.సుశీల, ఇన్‌చార్జి తహశీల్దార్ కె.అజయ్‌బాబు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంతో ప్రతిపాదిత పనులు

తాళ్లపూడి, ఆగస్టు 23 మండలంలోని తాళ్లపూడి, అన్నదేవరపేట గ్రామాల్లో జరిగిన సభలకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ముందుగా ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎక్కువగా రోడ్లు, డ్రైనేజీలు లేవని కొన్ని చోట్ల చినుకు పడితే చాలు జలమయమైపోతున్నాయని సభ దృష్టికి పలువురు తీసుకురాగా గ్రామాల్లో అవసరమైన పనులను ప్రతిపాదించి ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎలిపే సుధారాణి, ఎస్‌వీ అనురాధ, నామన పరమేశ్వరరావు, అప్పన జగదీష్, కొరారు వెంకట్రావు, కాకర్ల సత్యేంద్ర, చెవ్వూరి బంగార్రాజు, ముళ్లపూడి శ్రీరామచంద్రమూర్తి, ఉడతా వీరేంద్ర, కలిశెట్టి సన్యాసినాయుడు, ఎంపీడీవో వెంకటరమణ, డీటీ భారతి, ఏఈ వెంకట్రావు, ఇరిగేషన్ ఏఈ సూర్యహాస్, ఈవోపీఆర్డీ వీరన్న పాల్గొన్నారు. గజ్జరంలో జరిగిన గ్రామసభలో డిప్యూటీ డీఎల్ ఏటీవో వసుంధర పాల్గొని క్షయవ్యాధి నిర్ధారణ, చికిత్స అత్యంత ఆధునిక పరికరాలతో పూర్తిగా అందిస్తున్నారని, ప్రతిఒక్కరూ క్షయ వ్యాధిపట్ల అవగాహన కలిగి క్షయ వ్యాధి రహిత జిల్లాగా ఉండేటట్టు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో గండి రాంబాబు, డాక్టర్ హారిక గుప్తా, వైద్య సిబ్బంది, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అన్ని వేళలా అందుబాటులో ఉంటా

చాగల్లు, ఆగస్టు 23: ప్రజా సమస్యల పరిష్కారం కోసం అన్ని వేళలా అందుబాటులో ఉంటానని, ఏ సమయంలోనైనా తమ సమస్యలను తీసుకురావచ్చునని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని చాగల్లు, మల్లవరంలో జరిగిన గ్రామసభలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం వ్యవస్థలను నాశనం చేసిందని అన్ని వర్గాల ప్రజలు బాధితులేనని అన్నారు. అన్ని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. మండలంలోని 13 పంచాయతీల్లో గ్రామసభలు జరిగాయి. పంచాయతీల పరిధిలోని రోడ్లు, డ్రైన్లు, నిర్మాణం, వీధిలైట్లు ఏర్పాటు కొవ్వాడ కాలువలోని గుర్రపు డెక్క తొలగింపు వంటి సమస్యపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కాలువలోని గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరాస్వామి, టీడీపీ నాయకులు ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, కరుటూరి సతీష్, కోడూరి కాశిగంగాధరరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో నిర్మలకుమారి, తహశీల్దార్ ఎం.మెరికమ్మ పాల్గొన్నారు.

గ్రామసభకు ఆలస్యంగా హాజరైన కార్యదర్శి

పెరవలి, ఆగస్టు 23: మండలంలో ఉపాధి హామీ గ్రామ సభలను నిర్వహించారు. మండల స్థాయి అధికారులు పర్యవేక్షించిన ఈ సభల్లో సీసీ రోడ్లు, డ్రైన్‌లు తదితర వాటికి ప్రతిపాదనలు స్వీకరించారు. ఈ సందర్భంగా తీపర్రులో జరిగిన కార్యక్రమంలో గత ప్రభుత్వ హయాంలో ఎప్పుడూ ఇటువంటి గ్రామ సభలు నిర్వహించలేదని, ఇటువంటి సభలు జరుగుతాయన్న విషయమే ఎవరికి తెలియదని పలువురు పేర్కొన్నారు. తమకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయింపులో అన్యాయం జరిగిందని పలువురు ఆగ్రహం వ్యక్తంచేశారు. కానూరు అగ్రహారంలో హనుమంతు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గ్రామ సభ ఏర్పాట్లు ఆలస్యంగా జరగడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పంచాయతీ కార్యదర్శి సమావేశానికి ముందుగా హాజరు కావాల్సి ఉన్నప్పటికీ ఆలస్యంగా వచ్చారని విమర్శించారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి గ్రామ సభలు దోహదం

దేవరపల్లి, ఆగస్టు 23: ప్రజాసమస్యలు పరిష్కరించడంతో పాటు అభివృద్ధి, సంక్షేమం వేగవంతం చేయడానికి గ్రామసభలు ఎంతో దోహదపడతాయని తహశీల్దార్ కె.రామలక్ష్మి అన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల వద్ద గ్రామసభలు సర్పంచ్‌ల అధ్యక్షతన జరిగాయి. అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు. దేవరపల్లిలో రూ.కోటితో పలు అభివృద్ధి కార్యక్రమాలకు అంచనా వేసినట్టు అధికారులు తెలిపారు. ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీలు, ప్రధాన సమస్యగా ఉన్నాయని, రైతులకు విద్యుత్ సమస్యలు వచ్చినా దేవరపల్లిలో లోఓల్టేజ్ లేకుండా చూడాలని, దానికి అనుగుణంగా కావాల్సిన ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయడం విద్యుత్ శాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నాయకులు అన్నారు. అలాగే కరుటూరి శ్రీనివాస్, యాగంటి వెంకటేశ్వరరావు, కంబాల సత్తిబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇరువైపులా ఆక్రమణలు తొలగించకుండా స్థానిక వినాయకుడి గుడి వద్ద నుంచి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం వల్ల రోడ్డు ఇరుగ్గా మారిందని, ఆక్రమణలు తొలగించాలని, కుక్కలను నిర్మూలించాలని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. టీడీపీ నాయకుడు సుంకర దుర్గారావు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో రోడ్లుకు ఎంత ఖర్చుపెట్టారు వివరాలు చెప్పాలని ఎన్‌ఆర్‌జీఎస్ అధికారులను నిలదీశారు. గత ప్రభుత్వంలో ఇళ్ల మంజూరులో పక్షపాత ధోరణితో పేదలకు అన్యాయం జరిగిందని అనడంతో వైసీపీ నాయకుడు, పంచాయతీ వార్డు సభ్యుడు పచ్చా రామ్‌గోపాల్ మాట్లాడుతూ తాము పార్టీలకు అతీతంగా అర్హులకే ఇచ్చామని అనడంతో ఇళ్లు మంజూరు కాని కొందరు.. తాము అర్హులైన తమకు ఇవ్వలేదని వాగ్వాదానికి దిగారు. గౌరీపట్నంలో రైతులు జగన్ భూహక్కు రీసర్వేలో అవకతవకలు జరిగాయని తప్పుడు భూసర్వేతో తమవి సొంత భూములైనా ఆన్‌లైన్‌లో ఇనాం భూములుగా చూపుతున్నాయని దీన్ని వెంటనే పరిష్కరించాలని అధికారులకు ప్రజాప్రతినిధులకు సూచించారు. 2018లో మినీ గోకులం పథకంలో తమకు షెడ్లు మంజూరయ్యాయని, నగదు కొంతమందికి చెల్లించి, మరికొంత మందికి చెల్లించలేదని అధికారులను నిలదీశారు. దానికి వారు 2018లో రైతుల అకౌంట్‌లకు పడ్డాయని ఒకసారి బ్యాంకులో స్టేట్‌మెంట్ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా టీడీపీ మండలాధ్యక్షుడు ఆంద్రూ అనీల్, ఉపసర్పంచ్ ఆంద్రూ రమేష్ మాట్లాడుతూ గౌరీపట్నంలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు తేవడానికి కృషి చేస్తామన్నారు. కొవ్వాడ కాల్వతో నాలుగు కిలోమీటర్ల మేర పంటలు ముంపుకు గురవుతున్నాయని, ఎంపీ ద్వారా నిధులు తీసుకొచ్చి కాల్వ పూడిక పనులు చేస్తామన్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు కడిమి వీరకుమారి, కరుటూరి ఉషారాణి, బొంతా నాగమణి, నాయుడు దుర్గాప్రసాద్, దోనెల్లి ధనలక్ష్మి, కుసులూరి స్వరూపరాణి, ఎంఈఓలు తిరుమలదాసు, అప్పారావు, ట్రాన్స్‌కో ఏఈ కృష్ణారావు, ఎంపీడీవో ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలో పంచాయతీలు నిర్వీర్యం: మద్దిపాటి

నల్లజర్ల, ఆగస్టు 23: మండలంలోని దూబచర్లలో జరిగిన గ్రామసభకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు విచ్చేసి మాట్లాడారు. గత ప్రభుత్వంలో గ్రామ పంచాయతీల నిర్వీర్యం చేశారని విమర్శించారు. గ్రామానికి కావలసిన రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, ఉపాధి కూలీలకు పనుల గుర్తింపు, రైతుల పంట పొలాల్లో కుంతలు ఏర్పాటు, అభివృద్ధి చేయడం, కాల్వలు, చెరువుల అభివృద్ధి, పుంత రోడ్ల పనులను గ్రామ సభల్లో గుర్తించాలన్నారు. గుర్తించిన పనులు పూర్తయితే గ్రామం సుభిక్షంగా ఉంటుందన్నారు. నల్లజర్లలో జరిగిన సభలో తహశీల్దార్ కృష్ణారావు ప్రజలకు అవగాహన కల్పించారు. చీపురుగూడెంలో ఎంపీటీసీ రావూరి వెంకటరమణ ఆధ్వర్యంలో గ్రామ సభ జరిగింది. కార్యక్రమాల్లో టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, కూచిపూడి ఉదయభాస్కర్, ఈడే శ్రీను, సర్పంచ్ బాలయ్య, కండెపు వెంకటరత్నం,యలమాటి శ్రీను, నల్లజర్ల సర్పంచ్ పల్లి జ్యోతి, చెల్లు పెదరామన్న పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

గోపాలపురం, ఆగస్టు 23: గోపాలపురంలో జరిగిన గ్రామసభకు మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు విచ్చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీలు, రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, తదితర మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అందు కోసం అవసరమైన నిధులను గ్రామపంచాయతీ ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామాల్లో ప్రాధాన్య క్రమంలో అవసర, అత్యవసరాలు గుర్తించి గ్రామసభలో ప్రజలు సూచించిన పనులను గుర్తించి వాటిని అంచనాలకు సంబంధించిన ప్రణాళికలు తయారు చేస్తారన్నారు. మండల యూనిట్‌గా సిద్ధం చేసిన ప్రణాళికలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ పైడి దొరబాబు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో పంచాయతీలు నిర్వీర్యమయ్యాయని, కూటమి ప్రభుత్వంలోనైనా అధికారులు, నాయకులు సమన్వయంతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సమావేశం దృష్టికి తీసుకెళ్ళారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ, జ్యేష్ట శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి వెంకాయమ్మ, దాసరి రవి, కాళ్ళపు బుజ్జి, కరిచర్లగూడెంలో వేముల నాగరాజు, జగన్నాథపురంలో కాట్రగడ్డ సురేష్, దొండపూడి ముత్యాలరాయుడు, రాజంపాలెంలో కాకర్ల జగదీష్, రామతులసి, చిట్యాలలో గద్దే హరిబాబు, వేళ్లచింతలగూడెం కొర్లపాటి రాము, వాదాలకుంటలో వడ్లమూడి రమేష్ పాల్గొన్నారు.

ఉపాధి పనులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు: ఎంపీపీ

ఉండ్రాజవరం, ఆగస్టు 23: గ్రామాల్లో ఉపాధి పనులు ద్వారా మౌలికసదుపాయాలు కల్పించుకోవచ్చని ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పాలంగి గ్రామంలో జరిగిన గ్రామసభకు ఆమె విచ్చేసి మాట్లాడారు. ఎంపీడీవో జీవీఎస్ రాజు మాట్లాడుతూ ఉపాధి పనులతో కూలీలకు ఉపాధి దొరుకుతుందని, పనులు గ్రామాల్లో గుర్తించి, ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. తొలుత టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సర్పంచ్ బొక్కా శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఉపాధి హామీ పథకం పనులు గుర్తించారు. వాటి వివరాలను తీర్మానాలు ద్వారా జిల్లా అధికారులకు ఆమోదం నిమిత్తం పంపించారు.


చాగల్లు గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి


ఉండ్రాజవరం: పాలంగి గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీపీ యల్లారీశ్వరి


తాళ్లపూడి: అన్నదేవరపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

ఆంధ్ర కేసరి సాహసం యువతకు స్ఫూర్తి

- అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజు
- ఘనంగా టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి

రాజమహేంద్రవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): దేశం కోసం తుపాకీ తూటాకు ఎదురుగా తన గుండెను నిలిపి 'ఆంధ్ర కేసరి'గా జేజేలు అందు కున్న టంగుటూరి ప్రకాశం పంతులు నేటి యు వతకు స్ఫూర్తి అని అడిషనల్ ఎస్పీ (పరిపాలన) ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం రాజశేఖర్ రాజు మాట్లాడుతూ నిర్భీతి, నిజాయితీ, నిబద్ధత, పేదల క్షేమం కోసం పోరాడే తత్వం వంటి సుగుణాలే టంగుటూరిని ప్రజా జీవితంలో సింహంలా నెలబెట్టాయని కొనియాడారు. ఆయన దేశభక్తి, త్యాగనిరతి అజరామరమన్నారు. కార్యక్రమంలో డీపీవో సిబ్బంది పాల్గొన్నారు. రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టంగుటూరి ప్రకాశం చిత్రపటానికి ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర కేసరి ఆశయాలను సాకారం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు తవ్వల వీరేంద్రనాథ్, ఉపాధ్యక్షురాలు నాగదేవర స్వర్ణపాప, ప్రధాన కార్యదర్శి పెళ్లూరి రమేశ్ పాల్గొన్నారు.

పెరవలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి కార్యాలయ సిబ్బంది పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, సీనియర్ అసిస్టెంట్ అరిగెల వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు

తాళ్లపూడి: మండలంలోని రాగోలపల్లి మండల పరిషత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దుర్గారావు మాట్లాడుతూ ప్రకాశం పంతులు 1872 ఆగస్టు 23న జన్మించారని తెలిపారు. స్వాతంత్రోద్యమంలో పాల్గొని బ్రిటీష్‌వారి తుపాకీకి తన గుండెను ఎదురొడ్డి కాల్చమని సవాలు విసిరారని, ఆయన ధైర్య సాహసాలకు ప్రజలు ఆంధ్ర కేసరి బిరుదును ఇచ్చి గౌరవించారని, ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

మంద పైకి దూసుకెళ్లిన వ్యాన్

- 14 మేకలు మృత్యువాత.. పదింటికి తీవ్ర గాయాలు
- రూ.3 లక్షల నష్టం.. పోతవరం-నల్లజర్ల రహదారిపై ఘటన

నల్లజర్ల, ఆగస్టు 23 : మరో పది అడుగులు వేస్తే గూటికి చేరే సమయంలో ఆ మూగజీవుల పాలిట మృత్యువు డీసీఎం వ్యాన్ రూపంలో వచ్చి కబళించింది. వివరాలు ఇలా ఉన్నాయి. దుప్పికుంట గ్రామానికి చెందిన యంట్రపాటి చంద్రయ్య మేకలు మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. తనకున్న 24 మేకలను శుక్రవారం ఉదయం అడవికి మేతకు తీసుకెళ్లాడు. సాయంత్రం 6గంటలకు ఇంటికి వస్తుండగా పోతవరం-నల్లజర్ల ప్రధాన రహదారి దాటుతున్న తరుణంలో పోతవరం నుంచి నల్లజర్ల వైపు వెళుతున్న డీసీఎం వ్యాన్ వేగంగా వచ్చి మేకల మంద పైనుంచి దూసుకు వెళ్లిపోయింది. మందలో 14 మేకలు అక్కడికక్కడే మృతి చెందగా మరో 10 మేకలు నడుము, కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడ్డాయి. సుమారు రూ.3 లక్షల నష్టం కలిగిందని మేకల కాపరి చంద్రయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మృతి చెందిన మేకల వద్ద చంద్రయ్య రోదన పలువురిని కంటతడి పెట్టించింది. జీవనాధరం మొత్తం మేకల పెంపకం ద్వారానే జీవిస్తున్న అతడికి న్యాయం చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. వ్యాన్ డ్రైవర్ వ్యాన్‌ను అక్కడే వదిలేసి పోలీసులకు లొంగిపోయాడు. సీఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పోతవరం-నల్లజర్ల ప్రధాన రహదారిపై మేకలను ఢీకొన్న వ్యాన్, ప్రమాదంలో మృతి చెందిన మేకలు

నల్లజర్ల పెట్రోల్ బంక్‌లో మోసం

బంక్ మూసి వేయాలంటూ వినియోగదారుల ధర్నా


పెట్రోల్ బంకు వద్ద ధర్నా చేస్తున్న కవులూరు గ్రామస్థులు

నల్లజర్ల, ఆగస్టు 23: నల్లజర్ల బస్‌స్టాండ్ సమీపంలో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో ఘరానా మోసం వెలుగు చూసింది. కవులూరు గ్రామానికి చెందిన కందుల లోకేశ్ శుక్రవారం నల్లజర్లలోని ఇండియన్ ఆయిల్ బంక్‌లో రూ.150 పెట్రోల్ కొట్టించుకుని అరకిలో మీటరు దూరం వెళ్లేసరికి పెట్రోల్ అయిపోయి ఆగిపోయింది. తిరిగి పెట్రోల్ బంక్‌కి వెళ్లి ప్రశ్నించగా.. తమ ఓనర్ వచ్చాక మాట్లాడుదువు బండి పక్కన పెట్టు అంటూ పంపు బాయ్ దురుసుగా వ్యవహరించడంతో లోకేశ్ గ్రామస్థులకు, స్నేహితులకు ఫోన్ చేసి చెప్పడంతో సుమారు 200మంది బంకు వద్దకు వచ్చి బంకు మూసి వేయాలని ధర్నా చేశారు. సీసీ కెమెరా చూపించమని డిమాండ్ చేయడంతో పంపు బాయ్ పంపు రీడింగ్ నిలిపి వేసినట్టు రికార్డు అయ్యింది. దీంతో తాము ఇన్నాళ్లుగా చాలా మోసపోయామని అనేక మంది వినియోగదారులు పోలీసులకు, తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దర్యాపు చేసి బంకు మూసి వేయకపోతే టెంటు వేసి ధర్నా చేస్తామని వినియోగదారులు పేర్కొంటున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దేవరపల్లి, ఆగస్టు 23: యర్నగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల్లో భాగంగా శనివారం సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ వీరభద్రరావు తెలిపారు. ఈ నేపథ్యంలో యర్నగూడెం, కృష్ణంపాలెం, త్యాజంపూడి, చిన్నాయిగూడెం, యాదవోలు పరిధిలో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.